Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 10.02.2017, శుక్రవారం | సంపుటి : 36 సంచిక : 36 | పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి   సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

- ➤ త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం
- ➤ లోకేష్‌కేనా... ఇంకా కొందరికా...?
- ➤ ఇప్పుడు వాయిదాపడితే ఇక లేనట్లే...?



• విస్తరణ...

## చేస్తాడా? వాయిదా వేస్తాడా?

**మంత్రివర్గ విస్తరణ... తెలుగుదేశంలో ఇదో బ్రహ్మపదార్థంగా మారింది. మంత్రివర్గ విస్తరణ అంటూ ఊహాగానాలు రావడం, ఆ తర్వాత వాయిదా వేయడం ఒక షెడ్యూల్‌గా తయారైంది. ఇదిగో ఈ సంక్రాంతికే... లేదు ఉగాదికి... ఇది కూడా మిస్సయితే దసరాకు... ఇలా మూడు సంవత్సరాలు గడుస్తున్నాయి గాని మంత్రివర్గ విస్తరణ మాత్రం జరగడం లేదు.**

2014లో చంద్రబాబు మంత్రివర్గంలోకి తీసుకున్న వారిలో సమర్థులకంటే అసమర్థులు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వాళ్లే ఎక్కువుగా వున్నారు. అసలు కొందరు ఎందుకు మంత్రులుగా ఉంటున్నారో కూడా అర్థం కాదు. వీళ్లు ప్రజలకూ ఉపయోగపడడం లేదు, అట్లాగని పార్టీకీ ఉపయోగపడడం లేదు. అసలు మంత్రులుగా తమ శాఖలపై పట్టు సాధించలేకపోతున్నారు. చాలామంది మంత్రులు డమ్మీలే! వారి శాఖల వ్యవహారాలను కూడా చిన్నబాబు లోకేష్ చూస్తున్నాడు. దీనికి ఉదాహరణ హోంశాఖ! ఈ శాఖలో బదిలీలుగాని, నియామకాలుగాని హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప కంటే కూడా లోకేష్ కనుసన్నలలోనే ఎక్కువుగా జరుగుతున్నాయి. ఇక రెవెన్యూ వ్యవహారాలు చూస్తే సంబంధిత మంత్రి కె.ఇ.కృష్ణమూర్తి కంటే, చంద్రబాబు నమ్మినబంటు పి.నారాయణ ఎక్కువుగా చూస్తున్నాడు. ఇలా ఏ మంత్రి ఏం పని చేస్తున్నాడో అర్థం కాని పరిస్థితైంది.

చంద్రబాబు మంత్రివర్గ విస్తరణకు పూనుకుంటే ముందుగా లోకేష్‌కు మంత్రిపదవి ఖాయం. అలాగే కొత్తగా కొందరిని, సీనియర్లను తీసుకోవాలంటే ఇప్పుడున్న వారిలో అసమర్థులను ఊడబెరకాలి. ఈ కోవలో చూస్తే పల్లె రఘునాధరెడ్డి, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, పీతల సుజాత, రావెళ్ల కిషోర్‌బాబు, పత్తిపాటి పుల్లారావుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా రాయలసీమ నాలుగు జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లో పార్టీ పుంజుకోవాలంటే 'రెడ్ల'కు ప్రాధాన్యత కల్పించాలి. ఈ కోణంలో పల్లె, బొజ్జలను తొలిగించి వైసిపి నుండి పార్టీలోకొచ్చిన భూమా నాగిరెడ్డి(కర్నూలు), ఆకే అమర్‌నాథ్‌రెడ్డి (చిత్తూరు), మాగుంట శ్రీనివాసులురెడ్డి(ప్రకాశం)లను మంత్రివర్గంలోకి తీసుకోవాలి. అలాగే

(మిగతా 11వ పేజీలో)

ఎన్టీఆర్ సినిమాలో...



## విలన్‌లే హీరోలు?



**తెలుగుజాతి ఆత్మ గౌరవ ప్రతీక స్వర్గీయ నందమూరి తారక రామారావు. తెలుగు నేలపై ఆయనో చరిత్ర. తెలుగుసినిమాకే కాదు, జాతీయ స్థాయిలో తెలుగు రాజకీయాలకే వెలుగు తెచ్చిన నాయకుడు. ఆయన జీవిత చరిత్రను సినిమాగా తీయబోతున్నానంటూ ఆయన తనయుడు, సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రకటించి రసవత్తర చర్చకు తెరలేపారు. అందులో ఎన్టీఆర్ పాత్రను తానే పోషిస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు.**

అయితే, ఎన్టీఆర్ జీవిత చరిత్రను సినిమాగా తీయడమంటే 'గౌతమీ పుత్ర శాతకర్ణి' సినిమా తీసినంత సులభం కాదు. చరిత్రలో వ్రాసిన దాన్ని బట్టి ఈ సినిమా తీసారు. కాబట్టి సినిమాలో వున్నదే చరిత్ర అనుకుంటారు ప్రజలు. ఆ కాలంలో జరిగిందేందన్నది ఈ కాలం వారికి తెలియదు. కాని ఎన్టీఆర్ జీవితచరిత్ర ఏంటన్నది ఈ కాలం వారికి తెలుసు. ఆయన జీవితంలో జరిగిన

(మిగతా 11వ పేజీలో)




నెల్లూరు 'దేశం'లో...

## నేతల కల్లోలం!

- ➤ ఓవైపు ఎమ్మెల్సీ సీటు ఫైట్లు
- ➤ ఇంకో వైపు కార్పొరేషన్‌లో వర్గాల ఫీట్లు



**పాత తెలుగుదేశం, కొంచెం కాంగ్రెస్, కొత్త వైయస్సార్ కాంగ్రెస్, కొంత బీజేపీ... ఈ పార్టీలన్నింటిని గ్రైండర్‌లో వేసి రుబ్బి తీస్తే వచ్చిన పిండే నెల్లూరుజిల్లా తెలుగుదేశంపార్టీ! ఇక్కడున్నది నూరుశాతం తెలుగుదేశం కాదు, అన్ని పార్టీల నుంచి వచ్చిన నాయకుల సమూహమే ఈ జిల్లా పార్టీ!**

కాబట్టే వర్గపోరులో కాంగ్రెస్‌పార్టీ కంటే కంపుగా తయారైంది. రాష్ట్రంలోనే తెలుగుదేశం పార్టీ బలహీనంగా వున్న జిల్లాల్లో నెల్లూరు ప్రధానంగా వుంది. 2014ఎన్నికల్లో ఎంపీ సీటును కోల్పోవడంతో పాటు,

(మిగతా 11వ పేజీలో)

# ఆర్టీసీ డ్రైవర్లపై 'రెడ్'మార్క్



*వాళ్లు ఆర్టీసీ డ్రైవర్లు... ఆక్యుపెన్సీ కోసం ఆరాటపడతారు. మైలేజీ పెంచ డానికి తాపత్రయపడతారు. తద్వారా అవార్డులు వస్తాయని ఆశ! అలాగే ప్రయాణంలో లగేజీ వేసుకుంటే నాలుగు రూపాయలు వస్తాయని చిన్న ఆశ! అంతకుమించి అవినీతి పరులేమీ కాదు. ప్రజలను పీడించి వేలు, లక్షలు దోచే అధికారులు కాదు. కుంభకోణాలు చేసి కోట్లు కొల్లగొట్టే ప్రజాప్రతి నిధులు అంతకన్నా కాదు. కాని ప్రయాణీకుల రూపంలో వచ్చిన ఎర్రచందనం కూలీలను ఎక్కించుకున్న నేరానికి ఇప్పుడు కేసుల్లో ఇరుక్కున్నారు. పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిరుగుతున్నారు.*

కావలి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సులు కావలి– బెంగుళూరు, బెంగుళూరు – కావలిల మధ్య ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటాయి. బెంగుళూరు నుండి బయలుదేరే ఈ బస్సులు కడప, వింజమూరుల మీదుగా కావలికి వెళతాయి. అయితే కొందరు ఎర్రచందనం స్మగ్లర్లు ఎర్రచందనం కూలీలను ఈ బస్సుల్లో ఎక్కించేవాళ్లు. వీళ్లు కడప జిల్లా బద్వేలు వద్ద అటవీప్రాంతంలో బస్సులు ఆపి దిగిపోయేవాళ్లు. ఇలా చాలారోజుల నుండి జరుగుతూ వస్తోంది. డ్రైవర్లు కూడా తమకు సీట్లు ఫుల్ అయ్యాయని చూసుకుంటు న్నారేగాని, తమ బస్సుల ద్వారా ఎర్రచందనం కూలీలు అటవీ ప్రాంతాల్లోకి వెళు తున్నారనే సమాచారాన్ని పోలీసులకు అందించలేదు. కావలి డిపోకు చెందిన బస్సుల ద్వారానే ఎర్రచందనం కూలీలు అడవుల్లోకిపోయి ఎర్రచందనం చెట్లను నరుకుతున్నారని పసిగట్టిన కడపజిల్లా పోలీసులు ప్రత్యేకనిఘా పెట్టారు. బెంగుళూరు– కావలి మధ్య నైట్‌సర్వీసుల్లో పనిచేస్తున్న 9మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. ఎర్రచందనం కూలీల తరలింపుపై డ్రైవర్ల పాత్ర ఎంతవరకు ఉందన్న దానిపై పోలీసుల విచారణ లోతుగా జరుగుతోంది. ఈ సంఘటనతో కావలి, ఆత్మకూరు డిపో కార్మికుల్లో ఆందోళన మొదలైంది. ఇద్దరు డ్రైవర్ల అకౌంట్లలో పెద్దమొత్తంలో నగదు జమ కావడాన్ని కనుక్కు న్నారు. అలాగే ఆత్మకూరు డిపోకు చెందిన కొందరు డ్రైవర్ల పాత్రపై కూడా ఆరా తీస్తున్నారు.

# ఆయన సాహితీ సేవ అపూర్వం

## 'సర్వజ్ఞ కుమార యాచేంద్ర సాహితీ సర్వస్వం' ఆవిష్కరణ



వెంకటగిరి అంటేనే సంగీత సాహిత్యాలకు తరగని సిరి అని, ఎంతోకాలంగా ఇక్కడి రాజులు సంగీతాన్ని, సాహిత్యాన్ని ఎంత గానో వృద్ధిచేసి ప్రజలందరి ప్రశంసలు అందుకున్నారని వక్తలు పేర్కొన్నారు. అటు పాలనాపరంగా, ఇటు సంగీత, సాహిత్య, కళారంగం, ఆధ్యాత్మికత్వంలలోనూ తమదైన ముద్రతో ప్రజలను ఆకట్టు కున్నారని, నాటి తరం రాజకుటుంబీకుల ప్రజాసేవ..కళాసేవ ఎన్నటికీ విస్మరించలేనిదని వారు కొనియాడారు. వెంకటగిరి రాజామందిరంలోని దర్బార్‌హాలులో రాజ కుటుంబీకుడు, సంగీత సాహిత్య సరస్వతి బిరుదాంకితుడు, పదరాగిణి వ్యవస్థాపకుడు డా.సాయికృష్ణ యాచేంద్ర ఆధ్వర్యంలో బుధవారం ఎంతో వేడుకగా సర్వజ్ఞకుమార యాచేంద్ర సాహితీ సర్వస్వం గ్రంథావిష్కరణ మహోత్సవం జరిగింది. రాజా సర్వజ్ఞ కుమార యాచేంద్ర రచించిన పదకొండు పుస్తకాలను కలిపి ఒకే గ్రంథంగా అత్యద్భుతంగా రూపొందించి ఆ గ్రంథాన్ని ఓ సాహితీ సర్వస్వంగా ఆవిష్కరించారు. 27వ తరం రాజా సర్వజ్ఞకుమార యాచేంద్ర ఆ కాలంలోనే దేశమంతా పర్యటించి సంగీత, సాహిత్యాలను వృద్ధిచేసేందుకు ఎంతగానో కృషి చేశారని ఈ సందర్భంగా సాయికృష్ణ యాచేంద్ర వివరించారు. పండిత కవి పోషణలో ఆయనకు ఆయనే సాటి అని అంటూ, సర్వజ్ఞ కుమార యాచేంద్రను స్ఫూర్తిగా తీసుకుని ఆ ఉత్తమ సంస్కారాన్ని తాము నేటికీ పరిరక్షించుకుంటూ వస్తున్నా మన్నారు. మాతృభాషను ఎవరూ విస్మరించకూడదని, తల్లిప్రేమకు అది ప్రతిరూపమని అన్నారు. తెలుగుభాష ఎంతో మధురమైనదని, దానిని పరిరక్షించుకోవాలని అన్నారు. ఎంతో వేడుకగా జరిగిన ఈ గ్రంథావిష్కరణోత్సవంలో రాజాల వంశీయులు, వారి వారసులైన వెంకటగిరి, బొబ్బిలి, పిఠాపురం, జట్టిప్రోలు, కొల్హాపురం రాజాల సంస్థానాలకు చెందిన రాజాల కుటుంబీకులు పలువురు పాల్గొనగా, వారి సమక్షంలో రాజాల కుటుంబ ప్రముఖుడు శ్రీ గోపాలకృష్ణ యాచేంద్రకు గౌరవపూర్వకంగా తొలిప్రతిని అందజేశారు. ఎంతోమంది ప్రముఖులు, రాజాల కుటుంబీకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్న ఈ పుస్తకావిష్కరణ మహోత్సవం ఆద్యంతం ఎంతో కన్నుల పండువగా జరిగింది. వెంకటగిరి రాజా కుటుంబీలు సాయికృష్ణ యాచేంద్రతోపాటు, ఈ కార్యక్రమంలో రామ్‌ప్రసాద్, సర్వజ్ఞ రాజగోపాల కృష్ణ యాచేంద్ర, బొబ్బిలి, కొల్హాపురం రాజాల కుటుంబీకులు ఎమ్మెల్యే సుజయకృష్ణ రంగారావు, బేబీనాయన, ఆదిత్య, సత్యప్రసాద్ యాచేంద్ర,సాయిరామ్ యాచేంద్రతో పాటు, వెంకటగిరి మునిసిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద, స్థానిక నాయకులు చెలికం శంకరరెడ్డి, జడ్పీటిసి సభ్యుడు రామచంద్రనాయుడు, బీరం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీని నమ్ముకున్న వారికే పదవులు

## - టిడిపి జిల్లా పరిశీలకుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి

పార్టీని నమ్ముకుని చిత్తశుద్ధితో పని చేస్తున్న వారికే సంస్థాగత కమిటీల్లో పదవులు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నెల్లూరుజిల్లా పరిశీలకుడు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచించారు. కొత్త, పాత అన్న రాగద్వేషాలను వదిలి అందరూ కలసి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నెల్లూరు నగర, రూరల్, కోవూరు, ఆత్మకూరు నియోజక వర్గాల సంస్థాగత ఎన్నికల అధికారుల శిక్షణా కార్యక్రమం సోమవారం నెల్లూరు లోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మెన్ జూపూడి ప్రభాకర్‌రావుతో కలిసి బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశచరిత్రలో ప్రజాస్వామ్య పద్ధతిలో విధివిధానాలతో సభ్యత్వ నమోదు, కార్యవర్గ ఎన్నికలను నిర్వహిస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం అని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, పార్టీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సంస్థాగత కమి టీలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి వివిధ రకాల ఎన్నికలు మొదలవుతాయి కాబట్టి ప్రస్తుతం ఎన్నిక కాబడుతున్న కమిటీలు చిత్తశుద్ధితో పనిచేసి గ్రామస్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజ లకు వివరించి పార్టీని బలోపేతం చేయ గలిగిన వారికే కమిటీల్లో స్థానం కల్పిం చాలని ఆదేశించారు. నాయకుల చుట్టూ తిరిగే వారికి పదవులు ఇవ్వవద్దని, ప్రజల చుట్టూ తిరిగే వారికే పదవులు కట్టబెట్టాలని జిల్లా నాయకత్వానికి ఆయన దిశానిర్దేశం చేసారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు,



శాశ్వత శత్రువులు వుండరని, పరిస్థితు లకు అనుగుణంగా నడుచుకోగలిగితే పార్టీ బలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో కొత్త, పాత నాయకులంటూ విభజించకుండా అందరిని కలుపుకుని వెళ్లాలని సూచించారు. కోర్టుల చుట్టూ తిరుగుతున్న ప్రతిపక్ష నాయకుడు విమర్శలు చేస్తున్నప్పుడు నాయకులు, కార్యకర్తలు వాటిని తిప్పి కొట్టాలని కోరారు. 2019 ఎన్నికల నాటికి రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, దీంతో జిల్లాలో నమ్ముకున్న వారికి న్యాయం జరుగుతుందని బుచ్చయ్య చౌదరి భరోసా ఇచ్చారు.

ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మెన్ జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని ఎలా బలోపేతం చేయా లన్న దానిపై యువనాయకుడు నారా లోకేష్ ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. సంస్థాగత నిర్మాణం బలంగా ఉంటేనే పార్టీ ఎప్పుడూ అధికారంలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీని వాసులురెడ్డి, మాజీమంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి.నరశింహయాదవ్, రాష్ట్ర కార్యదర్శి ఎరిక్షన్‌బాబు, రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ మన్నవ శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్ళపాక అనూరాధ, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు, నాయ కులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్స్ ఫలితాలు

పోలీసు కానిస్టేబుల్స్(సివిల్, ఏఆర్), జైల్ వార్డెన్ల పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. నెల్లూరుజిల్లాలో 3,919మంది జనవరి 22వ తేదీన రాత పరీక్ష రాశారు. గత ఏడాది జూలైలో రాష్ట్ర ప్రభుత్వం 4,548 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో భాగంగా జిల్లాలో 289 ఉద్యోగాలకు 21,141మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. నవంబర్ 6న జరిగిన ప్రిలిమినరీ పరీక్షల్లో 5,453 మంది పురు షులు, 397మంది మహిళలు ఉత్తీర్ణులై దేహదారుఢ్య పరీక్షలకు అర్హత సాధిం చారు. డిసెంబర్ 19 నుంచి 24వ తేదీ వరకు జరిగిన పరీక్షల్లో 3,919 మంది తమ ప్రతిభను కనపరిచి మెయిన్స్ రాత పరీక్షకు ఎంపికయ్యారు. ఈ ఏడాది జనవరి 22న తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, కర్నూలులో పరీక్షలు రాశారు. సోమవారం పరీక్షా ఫలి తాలు వెలువడ్డాయి. అభ్యర్థుల సౌకర్యార్థం స్కాన్డ్ ఓఎంఆర్ షీట్లు రిక్రూట్‌మెంట్ ఏపిపోలీస్.జిఓ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 7వ తేదీ నుంచి అందుబాటులో ఉంచు తున్నట్లు ప్రకటించారు.

## నెల్లూరుజిల్లాలో...

# రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గింది

ప్రభుత్వానికి ఆదాయాన్ని సంపాదించిపెట్టే శాఖల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి. నెల్లూరుజిల్లాలో గత మూడునెలలుగా రిజిస్ట్రేషన్ ఆదాయం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. నవంబర్ నెలలో వెయ్యి, అయిదు వందల రూపాయల నోట్లను రద్దు చేయడంతో రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గిపోయాయి. దీంతో ప్రతిరోజూ వందకుపైగా రిజిస్ట్రేషన్లు జరిగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పది, ఇరవై రిజిస్ట్రేషన్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ పరిధిలో 9 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ పరిధిలో 10 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పని చేస్తున్నాయి. ప్రతి ఏడాది మార్చి నెలాఖరుకులోగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేధించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నోట్ల రద్దు కారణంగా లక్ష్యాన్ని ఛేధించలేని పరిస్థితుల్లో ఉన్నాయి.

### మార్చి నెలలో జోరు పెరుగుతుంది.. - యం.అబ్రహం

మార్చి నెల నుంచి రిజిస్ట్రేషన్ ఆదాయం జోరు పెరుగుతుందని నెల్లూరుజిల్లా రిజిస్ట్రార్ యం.అబ్రహం అన్నారు. మంగళవారం ఆయన నెల్లూరుజిల్లా కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భవనాలు, ఇళ్ల స్థలాలు అమ్మకాలు, కొనుగోలు చేసేవారి సంఖ్య తక్కువగా ఉందన్నారు. బ్యాంకుల వద్ద ఆర్థిక సమస్యలు లేని కారణంగా మార్చి నెలలో రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. జిల్లాలో కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మోడల్‌గా తీసుకున్నామన్నారు. నెల్లూరు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ బాషా, కోవూరు సబ్‌రిజిస్ట్రార్ వెంకటనాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేకహోదా సాధనకు ఉద్యమించాలి



ప్రత్యేకహోదా కోసం విద్యా ర్థులు ఉద్యమించాలని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మధు అన్నారు. గూడూరులోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సద స్సును సోమవారం నిర్వహించా చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకహోదాతో పరిశ్రమలు వచ్చి విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## చెంగాళమ్మతల్లికి...

# భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన

### - వేమిరెడ్డి ఉభయకర్తృత్వంలో ఘనమైన పూజలు

తెలుగు, తమిళ ప్రజల ఆరాధ్యదైవంగా తమిళ నాడు-నెల్లూరుజిల్లా సరిహద్దులో వున్న సూళ్ళూరు పేటలో కొలువైవున్న శ్రీ చెంగాళపరమేశ్వరి అమ్మ వారికి ఈ నెల 7వ తేది నుంచి ఎంతో వైభవంగా కోటికుంకుమార్చన పూజలు జరుగుతున్నాయి. ఈ నెల 15వ తేది వరకు ఎంతో కన్నులపండువగా జరుగనున్న ఈ కోటికుంకుమార్చనలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరిస్తున్నారు. అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన కోటికుంకుమార్చన పూజలను గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి పెద్దఎత్తున నిర్వహించడం ఇదే తొలిసారి. నెల్లూరుకు చెందిన ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త, ఆధ్యాత్మికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి-ప్రశాంతి దంపతులు ఉభయ కర్తలుగా వుండి ఈ పూజలను వేడుకగా నిర్వహింప జేస్తున్నారు. తొలుత వీరు శ్రీ చెంగాళపరమేశ్వరి అమ్మవారి మూలవిగ్రహం వద్ద పూజలు నిర్వహించి, కోటికుంకుమార్చన కోసం ప్రత్యేకంగా నిర్మించిన వేదిక వద్దకు వచ్చి అమ్మవారి ఉత్సవమూర్తిని దర్శించు కున్నారు. వేదపండితుల వేదమంత్రోచ్ఛటనల మధ్య, మంగళవాయిద్యాల మధ్య, పెద్దపెట్టున భక్తులు చేసిన అమ్మవారి నామస్మరణల మధ్య, కోటికుంకుమార్చన పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అందరినీ చల్లగ కాపాడే తల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. భక్తుల కొంగుబంగారమైన.. ఆ చెంగాళమ్మతల్లికి ఇంత వేడుకగా కోటికుంకుమార్చన పూజలు నిర్వహిస్తుం డడంతో సూళ్ళూరుపేట నుంచే కాక పరిసరప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించు కుంటున్నారు. రెండవరోజైన బుధవారం జరిగిన ఈ వేడుకలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 150 మంది వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలతో కోటి కుంకుమార్చన వేదిక మారుమ్రోగింది. 'నవదుర్గాం.. మహాకాళీం, బ్రహ్మ విష్ణు శివాత్మికామ్, త్రికాల జ్ఞాన సంపన్నాం..నమామి భువనేశ్వరీమ్'..అంటూ ఆ చెంగాళమ్మతల్లిని మనసారా స్తుతిస్తూ భక్తులు ఈ వేడుకలో పాల్గొంటున్నారు. విశేష పుష్పాలంకరణ లతో శోభిల్లుతున్న అమ్మవారికి ప్రణమిల్లి ఆ చెంగా ళమ్మతల్లి చల్లని దీవెనలందుకుంటున్నారు. ఎంతో శోభాయమానంగా జరుగుతున్న ఈ కోటికుంకుమార్చన కార్యక్రమంలో తొలిరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ దాత, వితరణగుణశీలి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి దంపతులతో పాటు, ఆలయ ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వరరెడ్డి, ఆలయ ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి, టిటిడి మాజీ ఛైర్మెన్ కనుమూరి బాపిరాజు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, శ్రీసిటీ అధినేత రవీంద్ర సన్నారెడ్డి తదితర ప్రముఖులు ఆశీనులై కోటికుంకుమార్చన పూజలకు శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం 1గంట దాకా జరిగిన ఈ కార్యక్రమం మళ్ళీ సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. ఈ వేడుకలో కేరళ హైకోర్టు న్యాయమూర్తి శేషాద్రినాయుడు, జడ్పీ ఫ్లోర్‌లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి, మాజీమంత్రి పరసా రత్నం, ఆలయ మాజీ ఛైర్మెన్‌లు బద్దెపూడి వేణుగోపాలరెడ్డి, ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, కాళంగి ప్రభాకర్, శ్రీసిటీ అధినేత రవీంద్రసన్నారెడ్డి తండ్రి రాజగోపాలరెడ్డి, మాజీ ఎంపిపి పిట్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. రెండవరోజు జరిగిన కార్యక్ర మంలో వేమిరెడ్డి దంపతులతో పాటు, తిరుమల తిరుపతి దేవస్థానాల బోర్డు ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, చెంగాళమ్మ ఆలయ ఇ.ఓ శ్రీనివాసులరెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు చిలకా యుగంధర్, ఆకుతోట రమేష్, పెరుమాళ్, పులుగు శ్రీనివాసులురెడ్డి, వేనాటి గోపాలరెడ్డి, పిట్ల సుహాసిని, అలవల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాలను ఆద్యంతం తిలకించి అమ్మవారి కరుణాకటాక్షలకు పాత్రులవుతున్నారు.



# ప్రజల అభ్యున్నతే స్వర్ణభారత్ లక్ష్యం

### - దీపా వెంకట్

ప్రజలందరికీ విద్య, వైద్యం అందించి వారి అభివృద్ధికి కృషి చేయడమే స్వర్ణభారత్ ధ్యేయమని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ దీపా వెంకట్ అన్నారు. బుధవారం ఆమె నెల్లూరు, బివినగర్‌లో వున్న కెవిఆర్ స్కూల్‌కు స్వర్ణభారత్ ట్రస్ట్ తర ఫున లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దీపమ్మ మాట్లాడుతూ, కృషి-క్రమశిక్షణ సిద్ధాంతలతోనే ఎంతో పట్టుదలతో తమ తండ్రి వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా, దేశం గర్వించదగిన వ్యక్తిగా ఎదిగారని కొనియాడారు. ఎలాంటి వసతులు లేని ఆ కాలంలో తమ తండ్రిగారు నాలుగు కిలోమీటర్లు నడిచి బడికి వెళ్ళేవారని, అక్షరాలను ఇసుకపై రాసుకుని నేర్చు కున్నారని, విద్యార్థులు కూడా అదే పట్టుదలతో సత్ప్రవర్తన.. క్రమశిక్షణతో ఎదగాలని.. కష్టపడి చదుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. తొలుత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు విజయప్రకాష్‌కు తమ ట్రస్ట్ తరఫున లక్ష రూపాయల చెక్కును అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నగర అధ్యక్షుడు మండ్ల ఈశ్వరయ్య, స్థానిక బిజెపి నాయకులు ఎర్రబోలు రాజేష్, ట్రస్ట్ సిఇఓ కోటేశ్వరరావు, పాఠశాల ఉపా ధ్యాయులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.





# ప్రజాసేవే ప్రథమ కర్తవ్యం

ప్రజాసేవే ప్రథమ కర్తవ్యమని నిత్యం గుర్తు చేసుకుంటూ పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ పిలుపునిచ్చారు. నెల్లూరులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం ఏఆర్ డీమొబలైజేషన్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఆర్ఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏఆర్ సిబ్బంది కవాతు నిర్వహించారు. వారి వద్ద నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి రాష్ట్రంలోనే బెస్ట్ పరేడ్‌గా కితాబిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయుధ దళ పోలీసులు క్రమశిక్షణకు మారుపేరన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, విఐపిల భద్రత, ఎస్కార్ట్ డ్యూటి, బందోబస్తుల విషయంలో సిబ్బంది పనితీరు ప్రశంసనీయమన్నారు. ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, ఎస్‌బి, నగర, రూరల్, ఏఆర్, హోంగార్డ్, ట్రాఫిక్ డిఎస్పీలు ఎన్.కోటారెడ్డి, జి.వి.రాముడు, కె.తిరుమ లేశ్వర్‌రెడ్డి, ఎల్.చెంచురెడ్డి, కె.శ్రీనివాసరావు, నిమ్మగడ్డ రామారావు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కలల ప్రతీక ఇస్రో



షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ బృందం

పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘు వీరారెడ్డి నేతృత్వంలోని ఇందిరా గాంధీ శతజయంతి ఉత్సవ కమిటి ఈ నెల 7వ తేదీన శ్రీహరి కోటలోని షార్ సెంటర్‌ను సంద ర్శించింది. మాజీస్పీకర్ నాదెండ్ల మనోహర్, పిసిసి ప్రధానకార్యదర్శి రుద్రరాజు, చిత్తూరు డిసిసి అధ్య క్షులు వేణుగోపాల్‌రెడ్డి, నెల్లూరు డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య, పీసీసీ ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, నెల్లూరు నగర అధ్యక్షులు ఉడతా వెంకట్రావ్‌లు ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి ఇస్రో అభివృద్ధిలో ఇందిరాగాంధీ పాత్ర మరువలేనిదన్నారు. షార్ కేంద్రంగా రాకెట్ ప్రయోగాలను విజయవంతం చేస్తున్న శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. ఈ నెల 15న ఒక రాకెట్ ద్వారా 104ఉపగ్రహాలను ప్రయోగిస్తుండడం పట్ల హర్షాన్ని వ్యక్తంచేస్తూ, ఈ ఘనతను భారత దేశానికి సొంతం చేస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. 1971లో ఇందిరాగాంధీ చేతులమీదుగా షార్‌సెంటర్‌ను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రకృతి వైపరీత్యాలను పసికడుతూ రైతులకు ఉపయోగపడే పరిజ్ఞానంగల ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపాలని రఘువీరారెడ్డి కోరారు. షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్ ఈ బృందానికి షార్‌కు సంబంధించిన ప్రయోగాల విశేషాలను వివరించారు.

# శ్రీసిటీలో ఈఎస్ఐ రాష్ట్ర మెడికల్ కమిషనర్

ఈఎస్ఐ కార్పొరేషన్ స్టేట్ మెడికల్ కమిషనర్ డాక్టర్ ఇమ్మానుయేల్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ పరిసరాల్లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చర్యల్లో భాగంగా ఆయన ఇక్కడకు విచ్చేశారు. శ్రీసిటీ వైస్ ప్రెసి డెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికి, సుమారు 20 వేల మంది ఇక్కడ వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్నట్లు కమిషనర్‌కు వివరించారు. ఇక్కడ కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి ఆవశ్యకతపై చర్చించారు.




డాక్టర్ ఇమ్మానుయేల్‌కు స్వాగతం చెబుతున్న శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్

వీలైనంత త్వరలో ఈ ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. మొదట 30 పడకల ఆసుపత్రితో ప్రారంభించి అంచలంచలుగా దాని స్థాయిని పెంచుతామన్నారు. ఇందుకు సంబంధించి స్థల పరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాత్కాలిక ఏర్పాటుగా ఇప్పటికే సత్యవేడు, వరదయ్యపాలెంలో ఇద్దరు ప్యానెల్ డాక్టర్లను నియమించామన్నారు. కమిషనర్ తో పాటు ఈఎస్ఐ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్ పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# ప్రకంపనలు సృష్టిస్తున్న ట్రంప్



**అగ్రదేశమైన అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికాలో గడబిడలకు తావిస్తుంటే, ప్రపంచవ్యాప్తగా ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ప్రజలకిచ్చిన హామీలను ఇప్పుడు అధ్యక్షునిగా విజయం సాధించి అమలుచేసేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో పలు కీలక నిర్ణయాలు వివాదాస్పదం అవుతుండడం పట్ల ప్రపంచం విభ్రాంతికి గురవుతోంది. ఈ పరిస్థితులు భవిష్యత్తులో మరెంతగా ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయో మరి!..**

అగ్రదేశమైన అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికాలో గడబిడలకు తావిస్తుంటే, ప్రపంచవ్యాప్తగా ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ప్రజలకిచ్చిన హామీలను ఇప్పుడు అధ్యక్షునిగా విజయం సాధించి అమలుచేసేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో, పలు కీలక నిర్ణయాలు వివాదాస్పదం అవుతుండడం పట్ల ప్రపంచం విభ్రాంతికి గురవుతోంది. అసలే సంచలనాలకు మారుపేరుగా వున్న ట్రంప్, తన నిర్ణయాలతో ప్రపంచాన్ని మరింత కలవరానికి గురిచేస్తున్నారు.

అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి ఆయన తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు వివాదాస్పదంగా వుంటున్నాయనే అభిప్రాయాలున్నాయి. అయితే, ఆయన ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. ఎన్నికలప్పుడు ప్రజలకిచ్చిన హామీల మేరకు ముందుకు సాగడానికి, అమెరికా భద్రతకు ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో అధ్యక్షుని వైఖరిని ఎవరూ కాదనలేరు కానీ, ఈ దశలో కొన్ని నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతుండడమే ఆందోళన కలిగించే అంశమని, దీంతో అమెరికాలో సైతం అశాంతి వాతావరణం అలముకుంటోందని, దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వున్న ఇతరదేశాలపై కూడా పడుతోందనే అభిప్రాయాలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

మొన్నటిదాకా వలస దారులకు స్వర్గధామంగా వుండే అమెరికా ఇప్పుడు ట్రంప్ విధానాలతో..అందుకు పూర్తిగా భిన్నంగా మారుతోంది. అన్నింటా అమెరికన్లకే తొలి ప్రాధాన్యం అనే నినాదంతో ఎన్నికల్లో నిలిచిన ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టాక ఆ నినాదాన్ని అమలుచేయడానికి సంకల్పించారు. ఆ మేరకు తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలను చూసి అమెరికాలోని అనేక ప్రసిద్ధమైన కంపెనీలతో పాటు, ప్రపంచ దేశాలు సైతం బిత్తర బోతున్నాయి. మరోవైపు, ఎంపికచేసిన కొన్ని ముస్లిం దేశాలపై నిషేధం విధించడం ప్రకంపనాలు సృష్టిస్తోంది. ఇలాంటి విధానాలు చివరికి ఏ పరిస్థితులకు దారితీస్తాయోమోననే భయం ప్రపంచదేశాలను హడలెత్తిస్తోంది. ఇలాంటి కొన్ని నిర్ణయాల వల్ల అమెరికన్లలో కూడా అసంతృప్తి పెల్లుబుకుతోందనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి.

ఏదేమైనా, అవకాశాలు అందరికీ సమానంగా వున్నప్పుడే సమాజంలో వాతావరణం ప్రశాంతంగా వుంటుంది. అలా కానప్పుడు, అవకాశాలు ఏ కొందరికి మాత్రమే లభించినప్పుడు ఆయా ప్రాంతాల్లో అశాంతి ప్రబలుతుంటుంది. ఇప్పుడు అమెరికాలో కూడా ఇలాంటి వాతావరణమే కనిపిస్తోందని అభిప్రాయాలు వినవస్తున్నాయి. ప్రపంచంలో వున్న అత్యధికశాతం ప్రతిభావంతులు అమెరికాలోని పెద్దపెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. అమెరికా ఆర్థికాభివృద్ధిలో మొన్నటిదాకా వారు అలా పాలు పంచుకున్నారు. అందువల్ల అక్కడి స్థానికులకు ఉద్యోగాలు తగ్గిపోయాయి. ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో స్థానికతను ప్రాతిపదికగా తీసుకుని ప్రచారం నిర్వహించడం ఫలితంగా విజయం సాధించడం జరిగింది. ఇప్పుడు, ఆ మేరకు ట్రంప్ తన ఎన్నికల హామీలను నిలబెట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కానీ, ఈ పరిస్థితుల్లో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ఆయా దేశాలకు గతంలో ఎప్పుడూ లేనివిధంగా సంకటస్థితిని కలిగిస్తుండడంతో అంతటా ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు అమెరికాలోని తెలుగు వారిలో కూడా అభద్రతాభావం ఏర్పడుతోంది. పూర్తిస్థాయి పౌరసత్వం వున్నవారు మినహా మిగిలినవారి పరిస్థితి ఏమవుతుందో.. అమెరికాలో చదువుకుని అక్కడే స్థిరపడాలనుకునేవారు ట్రంప్ నిర్ణయాలతో ఎప్పుడు అమెరికాను వీడిపోవలసి వస్తుందోననే ఆందోళనలో వున్నారు. హెచ్1-బి వీసాలపై అమెరికా ఆంక్షలు విధించడంతో, ఆ దేశంలో స్థిరపడ్డ లక్షలాదిమంది భారతీయుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. చట్టబద్ధంగా అమెరికాలో వుండే వలసదారులను సగానికి తగ్గించేందుకు అమెరికాలో ప్రయత్నాలు జరుగుతుండడంతో, అమెరికాలో గ్రీన్‌కార్డు పొంది స్థిరనివాసం ఏర్పరుచుకోవాలనుకునేవారికి గట్టి ఇబ్బందులు ఎదురుకానున్నాయనే ఆందోళన కనిపిస్తోంది. ఆ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఆచరణలోకి వస్తే అమెరికాలో వుండేందుకు వెళ్లినవారికి ఇబ్బందులు తప్పవని అందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు కూడా.

అయితే, భూగోళం నుంచి ఉగ్రవాదాన్ని తుడిచేస్తానని ట్రంప్ శపథం చేయడం, ఆ మేరకు ఉగ్రమూకలపై కఠినచర్యలకు సమాయత్తం కావడం ఎంతైనా హర్షదాయం. అందులోనూ రాక్షసత్వానికి మారుపేరైన ఐఎస్ లాంటి ఉగ్రవాద సంస్థలు ప్రపంచానికి ముప్పుగా తయారైవున్న నేపథ్యంలో ఉగ్రవాదం ఎక్కడ ఏ తీరులో వున్నా దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదు. ఇలాంటి అంశాల్లో అమెరికాతో పాటు, ప్రపంచమంతా కలసి పోరాడాల్సిందే. ఈ విషయంలో అమెరికాకు అందరి మద్దతు వుంటుంది కూడా.

ఏదేమైనా, అపారమైన సైనిక శక్తి. అమేయమైన సాంకేతిక పరిజ్ఞానం.. అత్యద్భుతమైన ప్రతిభా పాటవాలతో ప్రపంచంలోనే అమెరికా ఒక భూతలస్వర్గంగా అవతరించింది. అగ్రరాజ్యమైన అమెరికాకు ఎప్పుడు ఏ పరిస్థితినైనా ఎదుర్కొనే సత్తా..అందుకు అవసరమైన సాధనసంపత్తి, శక్తిసామర్థ్యాలు అన్నీ వున్నాయి. అమెరికా ఎవరికీ భయపడాల్సినదేమీ లేదు. అగ్రరాజ్యంగా ఆ ధైర్యస్థైర్యాలు అమెరికాకు ఎప్పుడూ వుండనే వున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సామాన్య ప్రజానీకానికి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. వారి అభ్యున్నతికి బాటలు వేస్తూ..మరోవైపు ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించివేసి, ప్రపంచంలో శాంతిని, సుస్థిరతనీ పాదుకొల్పినప్పుడే అగ్రరాజ్యమైన అమెరికా ప్రపంచ ప్రజలందరి హర్షాతిరేకాలందుకుంటుంది. ఎంతో విజ్ఞతతో.. సంయమనంతో ప్రపంచమానవాళి అంతా హర్షించే విధంగా తగు నిర్ణయాలు తీసుకుని.. ప్రపంచానికే అమెరికా ఆదర్శవంతం కావాలన్నదే అందరి ఆకాంక్ష!..

---

## క్యాన్సర్ వ్యాధిపై
## అవగాహన సదస్సు



పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బుజ బుజనెల్లూరులోని శ్రీనివాస స్కూలులో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరుజిల్లా స్వచ్ఛంధ సేవా సంస్థల అధ్యక్షుడు ఇవియస్ నాయుడు పాల్గొని మాట్లాడుతూ మనిషిలో గర్భాశయం, రొమ్ము, ఊపిరితిత్తులు, పేగులు, శ్వాస నాళాలు తదితర భాగాలకు క్యాన్సర్ వచ్చే అవకాశం వుందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. పిఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు శాఖ వరపు వేణుగోపాల్ మాట్లాడుతూ మనిషిలోని కణాలు చాలా వేగంగా, అస్తవ్యస్తంగా విభజన జరిగి ఏర్పడే కణ సమూహాలు క్యాన్సర్‌గా మారే అవకాశ ముందన్నారు. సంస్థ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు, స్కూలు హెచ్‌ఎం ఎన్.సుస్మిత, ఉపాధ్యాయుడు ఎన్.హరికృష్ణ, గోగులపల్లి రవి, ఓరుంపాటి హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# ఎస్.సి సబ్‌ప్లాన్ పనులు వెంటనే మొదలుపెట్టాలి

**- వైసిపి నేతలు**



నెల్లూరు నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ జూపూడి ప్రభాకర్‌రావును ఈ నెల 6వ తేదీ నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్ యాదవ్, విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, కార్పొరేటర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం కూడా 2015-16 సంవత్సరానికి సంబంధించిన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల పనులు పూర్తికావచ్చి బిల్లులు సైతం చెల్లించినా, నెల్లూరు నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో మాత్రం ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదని, అలాగే పింఛన్‌ల మంజూరులో ప్రభుత్వ పరంగా పాటించవలసిన నియమ నిబంధనలు పాటించకపోవడంతో అర్హులైన ఎస్సీలకు అన్యాయం జరుగుతుందన్నారు. అదే విధంగా ఎస్సీ సబ్సిడీ లోన్‌ల మంజూరులో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, లోన్‌ల మంజూరుకు కొంతమంది అధికారపార్టీ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల పనులు వెంటనే ప్రారంభమయ్యేలా, లోన్‌ల మంజూరులో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా జూపూడిని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేలూరు సుధారాణి, ఓబిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, గోగుల నాగరాజు, ఎం.డి ఖలీల్‌అహ్మద్, దేవరకొండ అశోక్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

---




## సమర్ధ అధికారి రాఘవరావు

రిపబ్లిక్‌డే సందర్భంగా జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న కావలి డిఎస్పీ రాఘవరావు సమర్ధ అధికారి. జిల్లా పోలీసు యంత్రాంగం సమర్ధ అధికారిని గుర్తించి రిపబ్లిక్‌డే రోజు ప్రశంసాపత్రం ఇవ్వడం అభినందనీయం. రాఘవరావు కావలి డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి కావలి పోలీసు సబ్ డివిజన్ పరిధిలో పేద ప్రజలు బడుగు, బలహీనవర్గాలు, దళితులు, గిరిజనులకు పోలీసు శాఖ ద్వారా సత్వర న్యాయం అందిస్తున్నారు.

**యస్.బాబురావు, కావలి.**

## దోమల దండయాత్ర

'దోమలపై దండయాత్ర' అంటూ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. వారోత్సవాలు, పక్షోత్సవాలు చేసింది. కోట్లు తగలేసింది. ఏం లాభం. నేడు ప్రజలపై దోమలే దండయాత్ర చేస్తున్నట్లుంది. ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో రోగాలు వచ్చిపోవాల్సిందే! ప్రపంచమంతా విజ్ఞానం వెల్లివిరుస్తుంటే మనం దోమలను నిర్మూలించలేకపోతున్నాం. దోమల నిర్మూలనపై వాగాడంబరం తప్పితే ఇంకేమీ లేదు. - **వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## అంతా జంబాలే!

పేరు గొప్ప - ఊరు దిబ్బ అన్నట్లుగా నడుస్తుంది చంద్రబాబు ప్రభుత్వం. ప్రచారం తప్పితే వాస్తవ అభివృద్ధి లేదు. మూడేళ్లలో రాష్ట్రంలో చెప్పుకోదగ్గ ఇండస్ట్రీ ఒక్కటీ రాలేదు. కాని పోర్టులు, సెజ్‌ల పేరుతో పేదల భూములు కాజేస్తున్నారు. అమరావతి రాజధాని అంటూ 33వేల ఎకరాల భూమి తీసుకున్నారు. ఇంతవరకు నిర్మాణాలు మొదలు కాలేదు. ఈ మూడేళ్లలో ఆ 33వేల ఎకరాల్లో వేలకోట్ల రూపాయలు విలువ చేసే వ్యవసాయ ఉత్పత్తులు వచ్చి ఉండేవి. అసలు సింగపూర్ లాంటి రాజధానిని రాష్ట్ర ప్రజలు కోరుకున్నారా? ఎవరైనా తమ ఊర్లు బాగుపడాలని కోరుకుంటారు. చంద్రబాబు రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేసి ఎడారుల్లో ఒయాసిస్‌లను వెదుక్కుంటున్నాడు. **- తెట్టు మాల్యాద్రి, చేవూరు.**

## అద్భుతాలేవి వెంకయ్యా?

పెద్దనోట్లు రద్దయ్యాక 50రోజుల్లో అద్భుతాలు చూస్తారని ప్రధాని మోడీ, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఊదరగొట్టారు. ఈ ఇద్దరికీ ఇంకా 50రోజులు పూర్తయినట్లు లేదు. దేవుడు నోరిచ్చాడు కదా అని నోటికి ఏదొస్తే అది మాట్లాడేసారు. ఇంతవరకు అద్భుతాలేవీ జరగకపోగా, పెద్దనోట్ల రద్దు వల్ల చిన్న వ్యాపారులు, రియల్టర్లు చాలా నష్టపోయారు. 50రోజుల తర్వాత అద్భుతాలేవో వెంకయ్యనాయుడన్నా వివరించాలి. **- కె.మహేష్, ఖాజీపేట.**

# టీడీపీని బట్టే... వైసిపి అభ్యర్థి!

ఏప్రిల్‌లో నెల్లూరుజిల్లా స్థానిక శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అభ్యర్థి ఎంపికకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. అధికార తెలుగుదేశం పార్టీలో ఈ సీటుకు పోటీ ఉండగా, ప్రతిపక్ష వైకాపా మాత్రం పోటీ పెట్టడానికి గట్టి అభ్యర్థి అన్వేషణలో వుంది. తొలుత వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థిని నేను చూస్తానని, బెంగుళూరులో అభ్యర్థి ఉన్నాడని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అయితే, ఆయన మనసులో వున్నోళ్ళు పోటీకి విముఖత చూపడంతో అభ్యర్థిని పెట్టే బాధ్యత నుండి రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి తప్పుకున్నట్లు తెలుస్తోంది. అయితే నెల్లూరుజిల్లా ఎమ్మెల్సీ నుండి ఆరునూరైనా అభ్యర్థిని నిలబెట్టాలన్న పట్టుదలతో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఉన్నాడు.

అయితే తెలుగుదేశం అభ్యర్థిని నిర్ణయించాక వైసిపి అభ్యర్థి తెరమీదకొచ్చే అవకాశాలున్నాయి. తెలుగుదేశం అభ్యర్థిని బట్టి ఎన్నికల వాతావరణం మారే అవకాశముంది. తెలుగుదేశం ఎమ్మెల్సీ టిక్కెట్‌ను ప్రస్తుత ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డితో పాటు నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అడుగుతున్నారు. వాకాటి ఎమ్మెల్సీ అయితే ఏదో సూళ్లూరుపేటలో తిరుగుతుంటాడు. అదే ఆదాల ఎమ్మెల్సీ అయితే నెల్లూరులో మరో పవర్ సెంటర్ ఏర్పాటవుతుంది. ఇప్పటికే మంత్రి నారాయణతో పాటు ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రలు తలా ఒక పవర్ సెంటర్ అయ్యారు. ఇప్పుడు ఆదాల కూడా ఎమ్మెల్సీ అయితే మూడు కిలోమీటర్ల పరిధిలోనే నాలుగు పవర్ సెంటర్‌లు ఏర్పడతాయి. కాబట్టే పార్టీలోని కొందరు ఆదాలకు ఎమ్మెల్సీ సీటు విషయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి నారాయణ వాకాటి నారాయణరెడ్డి వైపే మొగ్గు చూపుతుండడంతో ఆయనకే సీటు ఖరారయ్యే అవకాశాలున్నాయి.

అయితే టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆదాల అయితే గెలుపుకు ఢోకా వుండదు. వైసిపి పోటీ ఇచ్చినా ఆదాల గెలుపును ఆపలేక పోవచ్చు. అదే వాకాటి అభ్యర్థి అయితే మాత్రం వైసిపికి ఒక మంచి అవకాశమిచ్చినట్లే! వాకాటికి ప్రత్యర్థిని తీసుకురావడం పెద్ద కష్టమేమీ కాదు. ఇక తెలుగుదేశంలోనే చాలామందికి వాకాటి అంటే పడదు. ఆ పార్టీకి చెందిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లే వైసిపి నుండి గట్టి అభ్యర్థి దిగాలని కోరుకుంటారు. అదీగాక, ఇప్పుడు వైసిపిలో వున్న స్థానిక ఓటర్లకు పార్టీ మారాలన్న ఆలోచన లేదు. ఇక రాదు కూడా! ఇక తెలుగుదేశంలో వైసిపి నుండి గెలిచి వచ్చినవాళ్లు వందమంది దాకా ఉన్నారు. వాళ్లంతా రేపు వాకాటికి ఓట్లేస్తారన్న గ్యారంటీ లేదు. అదీగాక, వాకాటి మీద నారాయణ బ్రాండ్ వుంది. ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లకు నారాయణ అంటే గిట్టడం లేదు. వాకాటిని ఓడిస్తే నారాయణను దెబ్బకొట్టినట్లవుతుంది. ఈ క్యాలిక్యులేషన్ నేపథ్యంలో ఆదాల కంటే కూడా వాకాటి అభ్యర్థి అయితే వైసిపికి వరమే!



## హైకోర్టు స్టేను కాదని...
# ఇఫ్కో సెజ్ కొచ్చిన సీఎం

కొడవలూరు మండలం రాచర్లపాడు వద్ద వున్న ఇఫ్కో సెజ్ భూములపై హైకోర్టు ఇచ్చిన స్టేను కూడా కాదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 3వ తేదీ ఇఫ్కో సెజ్‌కు వచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన గాలి విద్యుత్ ఫ్యాన్‌ల కర్మాగారమైన గమేషా ఫ్యాక్టరీని ఆయన ప్రారంభించారు. ఫ్యాక్టరీలో తిరిగి వివిధ విభాగాలను ఆయన పరిశీలించారు. మొదట దామవరం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో సీఎం హెలికాప్టర్ దిగింది. ఇక్కడ జిల్లా తెలుగుదేశం నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడ నుండి ఇఫ్కో సెజ్‌కు బయలుదేరిన చంద్రబాబు తన కారులోనే కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఎక్కించుకున్నారు. ఇఫ్కో సెజ్ భూములను కాలుష్యకారక భూములకు ఇస్తున్నారని ఇటీవల కొందరు ఉద్యమం చేస్తున్న నేపథ్యంలో ఫ్యాక్టరీ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం గమేషా ఫ్యాక్టరీ ప్రారంభిస్తే, తన పదవికి రాజీనామా చేస్తానన్న కొడవలూరు జడ్పీటీసీ ఇరువూరు శ్రీధర్‌రెడ్డి సీఎంకు హెలిప్యాడ్ వద్దే ఒక వినతిపత్రం ఇచ్చివెళ్లారు.

# టార్గెట్ ఎమ్మెల్యే...

## • అజీజ్ మనసులో మాట



జిల్లాలో మంత్రి నారాయణను మొదలుకొని ఏ ప్రధాన తెలుగుదేశం నాయకుడిని కూడా లెక్కపెట్టకుండా వ్యవహరిస్తున్న మేయర్ అబ్దుల్ అజీజ్ ఎట్టకేలకు తన మనసులోని మాటను బయటపెట్టాడు. తన లక్ష్యం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు నుండి పోటీ చేయడమేనని చెప్పుకొచ్చాడు. దీంతో నెల్లూరు నగరంలో సరికొత్త వర్గపోరుకు తెరతీసినట్లయ్యింది. మేయర్ అజీజ్ మొదట నుండి కూడా ఎవరినీ పట్టించుకోకుండా, ఏ నాయకుడినీ సంప్రదించకుండా సొంతంగా వ్యవహరిస్తున్నాడు. ముఖ్యంగా కార్పొరేషన్ పరిధిలోకి నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాలు రెండూ వస్తున్నప్పటికీ, నగర నియోజకవర్గ ప్రాంతాల పైనే ఎక్కువ దృష్టిపెట్టాడు. కొందరు కార్పొరేటర్లను కాంట్రాక్ట్ పనుల ఆశ చూపి తన అనుచరులుగా మార్చుకున్నాడు. తనకు వ్యతిరేకంగా వున్న కార్పొరేటర్ల డివిజన్లలో తానే సొంతంగా వేలుపెడుతున్నాడు. ఇవన్నీ కూడా రేపటి ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే! నెల్లూరు నగరంలో ముస్లింల ఓట్లు ఎక్కువ! రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలకు కొన్ని సీట్లు ఇవ్వాల్సి వుంటుంది. ఆ కోటాలో సీటు తెచ్చుకోవాలని అజీజ్ ఆలోచన! అందుకే లోకేష్ వద్ద ముస్లిం ట్రంప్‌కార్డును బాగానే వినియోగిస్తున్నాడు.

2014 ఎన్నికల సమయంలో కూడా నెల్లూరు నగరం వైకాపా సీటుకు అజీజ్ బలంగానే ప్రయత్నించాడు. ఇందుకు మేకపాటి మద్దతు కూడా తీసుకున్నాడు. అయితే నెల్లూరు నగరంలో అనిల్ పాతుకుపోవడం, పని చేసుకుపోవడంతో అతనికే జగన్ టిక్కెటిచ్చాడు. అలాగే అజీజ్‌ను నెల్లూరుకు తొలి ముస్లిం మేయర్‌ను చేశాడు. మేయర్ అయిన నెలకే అజీజ్ జగన్‌కు హ్యాండిచ్చి, తెలుగుదేశంలో చేరిపోయాడు.

వైకాపాలో నెరవేరని తన ఎమ్మెల్యే కలను టీడీపీలో నెరవేర్చుకోవాలనే ప్రయత్నాల్లో అజీజ్ ఉన్నాడు. అయితే ఇప్పటికే ఆనం, ముంగమూరు, కోటంరెడ్డి శీనయ్యలు బలంగా పోటీ పడుతున్న నెల్లూరు నగరం సీటు అజీజ్‌కు అందడం అనుమానమే!

# నెల్లూరుపై 'చిన్న'చూపు



***ప్రతి రైల్వే బడ్జెట్‌లోనూ నెల్లూరుజిల్లాకు మొండిచేయే చూపిస్తున్నారు. ప్రతి బడ్జెట్ సమయంలోనూ ఏదేదో వస్తాయనుకోవడం, బడ్జెట్‌లో ఏమీ రాక నిరాశ చెందడం ఆనవాయితీగా వస్తోంది.***

ఈ ఏడాది ఆర్థిక బడ్జెట్‌లోనే రైల్వేబడ్జెట్‌ను మిక్స్‌చేసి ప్రవేశపెట్టడం తెలిసిందే! ఈసారి బడ్జెట్‌లో జిల్లాకు పెద్దగా ఒరిగిందేమీ లేకపోయినా ఒకట్రెండు పనులపై మాత్రం దయతలిచారనే చెప్పుకోవాలి. ముఖ్యంగా జిల్లాలోని మెట్టప్రాంతానికి వరమైన నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్‌కు 10కోట్లు ముష్టి వేశారు. ఈ పదికోట్లతో ఏం పనులు జరుగుతాయో ఆ దేవుడికే తెలియాలి. కృష్ణపట్నం, ఓబులాపురం రైల్వేలైన్‌కు మాత్రం 100కోట్లు కేటాయించడం కొంత సంతోషించాల్సిన విషయం. ఇక కృష్ణపట్నం - వెంకటాచలం మధ్య డంబ్లింగ్‌కు, విద్యుద్దీకరణకు కేవలం కోటి మాత్రమే కేటాయించారు. గూడూరు-దుగరాజపట్నం లైన్ సర్వేకు 10లక్షలు, గూడూరు-తిరుపతిల మధ్య గేజ్ మార్పిడికి 50లక్షలు కేటాయించారు. ఇవి ఏ మూలకూ సరిపోవు. ఇవి కాక జిల్లాలో కొన్ని రైల్వేఓవర్ బ్రిడ్జిలు, రైల్వే క్రాసింగ్‌లు, రైల్వేస్టేషన్‌ల ఆధునీకరణకు కొంత నిధులు విదిల్చారు. అయితే జరగాల్సిన అభివృద్ధి పనులకు ఇచ్చిన నిధులకు ఏ మాత్రం పొంతన లేదు.



# ఇంకా దొరకని మోక్షం!

## • ప్రారంభోత్సవానికీ కుదరని ముహూర్తం

***విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం... వివాదాలకు కేరాఫ్ అడ్రస్. ప్రతిరోజూ ఏదో ఒక వివాదమే... యూనివర్శిటీని మొదలుపెట్టినప్పటి నుండి ఆందోళనలతో ప్రయాణమే! సిబ్బంది నియామకాలు, హాస్టల్ మూత, బోధనా తరగతులు, భవనాల కాంట్రాక్ట్ పనులు... ఒకటేమిటి ప్రతి అంశంలోనూ వివాదమే!***

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో వి.ఆర్. విద్యాసంస్థలలో మొదలైన విశ్వవిద్యాలయంకు వెంకటాచలం మండలంలోని కాకుటూరు వద్ద ఆయనే 60ఎకరాల భూమి కేటాయించడం తెలిసిందే! ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పుడు ఇక్కడ యూనివర్శిటీ కొత్త భవనాలకు నిధులు మంజూరు చేయబడి శంకుస్థాపన కూడా జరిగింది. యూనివర్శిటీ భవనాల నిర్మాణం పూర్తయ్యింది. విఆర్ విద్యాసంస్థలలో నడుస్తున్న యూనివర్శిటీని కొత్త భవనాలలోకి మార్చాలని విద్యార్థి సంఘాలు ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నాయి. అయితే దానికి ముహూర్తమే కుదరడం లేదు. ఈ నెల 3వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు వచ్చి ఇఫ్కో సెజ్‌లో నిర్మించబడ్డ 'గమేషా' ఫ్యాక్టరీని ప్రారంభించి వెళ్లారు. వాస్తవానికి ఆరోజు విశ్వవిద్యాలయం భవనాల ప్రారంభోత్సవం సీఎం పర్యటనలో ప్రధాన కార్యక్రమం. చివరికి చూస్తే ఆ ప్రోగ్రామే లేకుండా పోయింది! అసలు విశ్వవిద్యాలయం భవనాలకు చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభోత్సవం జరుపుకునే అదృష్టం ఉందా? అన్నది ప్రశ్న! ఆ ముహూర్తం ఇంకెప్పుడొస్తుందో?


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




## బధిరుల చెస్ పోటీలకు
# విపిఆర్ చేయూత



ఈ నెల 6, 7తేదీలలో నెల్లూరులోని ఏ.సి స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ 2వ రాష్ట్ర స్థాయి బధిరుల చెస్ పోటీలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. బధిరుల అసోసియేషన్, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన బధిర క్రీడాకారులకు విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ రెండురోజులు భోజన వసతి కల్పించి తన మానవత్వాన్ని చాటుకున్నారు.


# ఆన్‌లైన్‌లో ఆల్ సర్వీసెస్



డిటిసి శివరాం ప్రసాద్

రవాణాశాఖకు సంబంధించి 83రకాల సేవలను ఇక ఆన్‌లైన్ ద్వారానే అందించనున్నట్లు డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరాం ప్రసాద్ తెలిపారు. 6వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని రకాల సేవలను ఆన్‌లైన్‌లో అందిస్తున్నామని, ప్రభుత్వం ఆదేశాల మేరకు మిగిలిన సేవలను కూడా త్వరలో ఆన్‌లైన్‌లో ఉంచబోతున్నామన్నారు. దీనికోసమే రవాణాశాఖ కార్యాలయంలో గత కొంతకాలంగా వున్న హెల్ప్‌డెస్క్‌ను కూడా తొలగించామని, ఏ సర్వీసుకైనా వినియోగదారులు నేరుగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ సేవలపై ప్రజల్లో అవగాహన వచ్చేవరకు తమ శాఖలోని సిబ్బంది ప్రజలకు సహకరిస్తారని, ఆన్‌లైన్ సేవలపై వారికి అవగాహన కల్పిస్తారన్నారు. ప్రజలంతా కూడా ఆన్‌లైన్ సేవలను ఉపయోగించుకోవడం వల్ల దళారుల బెడద, కమీషన్ల గొడవ తగ్గుతుందన్నారు.

# పోలీసులకు ఇళ్ల స్థలాలు కావాలి



పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ పోలీసు అధికారుల సంఘం నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. నెల్లూరుజిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు ఎం.ప్రసాదరావు, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి గోపాల్‌లతో కలిసి 6వ తేదీ విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి చంద్రబాబుకు వినతిపత్రం అందించారు. 2004లో పోలీసు ఎంప్లాయిస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నామని, ఈ సొసైటీ ద్వారా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు.

# మయూర్... ఫైర్



మా డివిజన్‌లలో అడ్డగోలు వ్యక్తుల పెత్తనమేంటి... పింఛన్‌లు కావాలంటే పాల్‌ను అడగాలా? షంషుద్దీన్‌ను వేడుకోవాలా... ఎవరు వీళ్ళు! కార్పొరేషన్‌కు వీళ్లకు సంబంధమేంటంటూ నెల్లూరు కార్పొరేషన్ 12వ డివిజన్ మేయర్ ఆనం రంగమయూర్‌రెడ్డి నిప్పులు కక్కారు. తన డివిజన్ పరిధిలో పింఛన్‌లు, ఋణాల వివరాల కోసం ఆయన సోమవారం కమిషనర్ ఛాంబర్‌కు వెళ్లారు. ఇన్‌ఛార్జ్ కమిషనర్ లేకపోవడంతో సూపరింటెండెంట్ సులోచన వద్దకు వెళ్లి తన డివిజన్‌లోని పింఛన్‌లు, ఋణాల జాబితా ఇవ్వాలని కోరారు. మీరు అడిగిన జాబితా నా వద్ద లేదు, మేయర్ ఛాంబర్ నుండి రావాలని చెప్పడంతో మయూర్‌కు అరికాల్లో మండింది. ఎవరీ పాల్... ఎవరీ షంషుద్దీన్... కార్పొరేషన్‌లో వీళ్ల బోడిపెత్తనమేంటంటూ తీవ్రంగా కోప్పడ్డారు.

# నెల్లూరు కబుర్లు

● 15రోజుల్లో కమిషనర్ ఎక్కడ...?

# మంత్రి మాట... నీటి మూట

పదిహేను రోజుల్లో నెల్లూరు కార్పొరేషన్‌కు కొత్త కమిషనర్ వస్తాడన్న మున్సిపల్ మంత్రి నారాయణ మాట నీటిమూటే అయ్యింది. ఆయన చెప్పిన 15రోజులు ఎప్పుడో అయి పోయాయి. ఇక్కడ కమిషనర్‌గా వున్న వెంకటేశ్వరరావును బదిలీ చేశారు. ఇక్కడకు కమిషనర్‌గా వేసిన హరీష్ రెవెన్యూ నుండి ఇంకా రిలీవ్ కాలేదు. ప్రస్తుతం జడ్పీ సిఇఓ రామిరెడ్డి ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఇక మార్చి 18 వరకు కొత్త కమిషనర్ వచ్చే పరిస్థితి లేదు. దీంతో మంత్రికి మాట మీద నిలబడే గుణం లేదని అర్థమైపోయింది.

## డ్వామా పి.డిపై ఫిర్యాదు!

తన స్కార్పియో వాహనాన్ని అద్దెకు తీసుకుని, అద్దెడబ్బు చెల్లించలేదని డ్వామా పి.డిపై ఎస్.ఏ.రసూల్ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్ ముత్యాలరాజుకు ఫిర్యాదు చేశారు. 2012 సెప్టెంబర్ నుండి నెలకు 30వేల బాడుగలెక్కన స్కార్పియోను అద్దెకు ఇచ్చానని, ఇంతవరకు అద్దెతో పాటు డీజిల్ ఖర్చు 3.61లక్షలు కూడా చెల్లించలేదని అతను ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఊర్లను చూపిస్తే నీళ్లిస్తాం

జిల్లాలో శుభ్రమైన తాగునీళ్ల లేక ఇబ్బంది పడుతున్న గ్రామాలను చూపిస్తే ఆ గ్రామాలలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామంటూ చిరంజీవి యువత కార్యకర్తలు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజును కోరారు. యువత జిల్లా అధ్యక్షుడు కొట్టె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వారు సోమవారం కలెక్టర్‌ను కలిసారు. మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్ తేజ పుట్టినరోజు నాడు గ్రామాలను దత్తత తీసుకుని, ఆ గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. కలెక్టర్ కూడా వాళ్ల సేవాదృక్పథానికి స్పందించి త్వరలోనే అలాంటి గ్రామాల వివరాలను అందిస్తానని హామీ ఇచ్చారు.

## అపోలోలో వైద్యశిబిరం



నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ సుమిత్ర శంకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమిత్ర శంకర్ మాట్లాడుతూ మహిళలలో చిన్నగా, పెద్దగా ఉన్న రొమ్ములను సరిచేయుట, మగవారి రొమ్ములో అధికంగా వున్న కొవ్వును తొలగించుట, గొంతు వద్ద సాగిన చర్మాన్ని శస్త్ర చికిత్స ద్వారా సరిచేయుట, ముఖచర్మం కాంతి కోసం చర్మపు పొరను తొలగించుట, శరీర భాగాలలో అధికంగా వున్న కొవ్వును తొలగించుట, తలపై కృత్రిమ వెంట్రుకలను అమర్చుట, అవాంఛిత రోమాలను తొలగించుట, టాటూలను తొలగించుట, గ్రహణమొర్రికి శస్త్ర చికిత్స, కాలిన శరీరానికి శస్త్ర చికిత్స, బుగ్గపై శస్త్ర చికిత్స ద్వారా గుంటలను సృష్టించుట వంటివి తమ ప్రత్యేకతని తెలిపారు.

## అసెంట్‌లో
# 'రత్నం' ప్రతిభ

నెల్లూరు డైకాస్ రోడ్డులో వున్న రత్నం మోడల్ స్కూల్ విద్యార్థులు చెన్నై సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అసెంట్ -2016 పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపారు. ఏడుమంది జోనల్ విజేతలుగా, 13మంది ఇంటర్ స్కూల్ విజేతలుగా, 29మంది స్కూల్ లెవల్ విజేతలుగా నిలిచారు. 7వ తేదీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు పతకాలు, షీల్డ్‌లు, సర్టిఫికెట్లు అందించి అభినందించారు.



# బలిజ ఉద్యోగుల క్యాలెండర్

ఉద్యోగస్తులు తమ విధులకు సంబంధించిన సమస్యలను బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి ద్వారా పరిష్కరించుకోవచ్చుని, ఇది చాలా మంచి అవకాశమని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఈ నెల 4న నెల్లూరులో జరిగిన బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థికలోటు వున్నప్పటికీ 43శాతం ఫిట్‌మెంట్‌నిచ్చి పి.ఆర్.సి.ని అమలు చేయడం జరిగిందన్నారు. నిధుల లభ్యతననుసరించి డి.ఎ.ను విడుదల చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగస్తులందరికీ గృహవసతి ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి ప్రెసిడెంట్ అనీల్, కార్యదర్శి చక్రధర్ పాల్గొన్నారు.

## మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి
# స్టడీ మెటీరియల్ పంపిణీ



మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో నెల్లూరు, బాలాజీనగర్‌లో ఎంఎస్ఎం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ జరిగింది. అలాగే టెన్త్ విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్స్‌లో 10రోజుల పాటు చిరు ఆహారాన్ని కూడా అందజేస్తామని ఈ సందర్భంగా మాగుంట శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. ఈ స్కూల్‌లోని మరమ్మత్తులు కూడా పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, బాలాజీనగర్ ఎస్.ఐ భాస్కరయ్య, సేవాసమితి సభ్యులు నాగేంద్ర, సాయికృష్ణ, మనోజ్‌చౌదరి, మౌళి, ప్రసాద్, చైతన్యరెడ్డి, భార్గవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పందుల ఏరివేతకు...
# చెన్నై పోటుగాళ్ళు!

నెల్లూరులో పందుల ఏరివేతపై ఎట్టకేలకు కార్పొరేషన్ అధికారులు స్పందించారు. పందుల ఏరివేత కోసం తమిళనాడు నుండి 20మందితో కూడిన స్పెషల్ టీంను దించారు. కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డి కాలనీ, ఇస్లాంపేట, గిరిజనకాలనీ, భగత్‌సింగ్ కాలనీ వంటి ప్రాంతాల్లో ఈ టీం పందులను పట్టుకుని తరలించాయి. నెల్లూరు నగరంలో ఒక్క పంది కూడా కనపడకూడదన్న లక్ష్యంతో పందుల ఏరివేతను మొదలుపెట్టామని, ఇక ఎవరు అడ్డొచ్చినా ఈ ఏరివేత ఆగదని కార్పొరేషన్ అధికారులు ఘనంగా ప్రకటించారు.

# అందరి మిత్రుడు.. ఈ బాలమ్మ పుత్రుడు

## కన్నుల పండువగా... బలరామయ్య షష్టిపూర్తి వేడుక

పెద్దఎత్తున తరలివచ్చిన ఆత్మీయులు...నిండుమనసుతో మిత్రుల అభినందనల పూలజల్లులు.. కలకాలం హాయిగా జీవించాలని దీవిస్తూ మాతృమూర్తి చల్లని దీవెనలు.. కుటుంబసభ్యులు.. బంధుమిత్రుల ఆత్మీయ తానురాగాల మధ్య, వీనులవిందు చేసే మధురమైన పాటలు.. సంగీతపు సవ్వడుల మధ్య.. ఈ నెల 3వ తేదీన నెల్లూరు పురమందిరంలో ప్రపంచ తెలుగు మహాసభకు రీజనల్ ఛైర్మన్‌గా, ఏసి సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా, సమాజసేవకునిగా నెల్లూరీయులకు సుపరిచితులైన నలుబోలు బలరామయ్యగారి షష్టిపూర్తి వేడుక ఎంతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ, అందరికీ ఆత్మీయుడు, అందరివాడు అయిన బలరామయ్య జీవితం ఎంతో ఆదర్శప్రాయ మన్నారు., మంచి నడక.. మంచి నడత కలిగి, స్నేహభావంతో.. సేవా భావంతో అందరి ప్రశంసలు అందుకుంటున్న బలరామయ్యకు 60వ జన్మదినోత్సవ వేడుక ఎంతో వైభవంగా జరగడం తనకెంతో ఆనందం కలిగిస్తోందన్నారు. స్నేహితులెవరు కనిపించినా ఆత్మీయంగా చాక్లెట్లు పంచుతూనే, 'నడక'తో అందరికీ ఆరోగ్యం పంచేవాడని, ఆయనకు మనీ కంటే మనుషులే ముఖ్యమని, ఇంట్లో 'ఆత్మీయ రామయ్య'గా..బయట 'భలేరామయ్య'గా ఆయన అందరి మనసులను ఆకట్టుకున్నారన్నారు. ఒక వ్యక్తిని సన్మానించుకోవాలంటే వారికి ధనమో..పదవులో వుండాల్సిన అవసరం లేదని, మంచితనం ఒక్కటి వుంటే చాలని, సేవాభావంతో సమాజానికి ఉపయోగపడితే అంతకన్నా కావాల్సిందేముందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి రత్నం, విశిష్ట అతిథులుగా జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, డాక్టర్ అంకిరెడ్డి, కావలి వ్యవసాయ మార్కెటింగ్‌కమిటీ ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యయాదవ్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-203 గవర్నర్ మైథిలి మనోహర్‌రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా-203 ప్రెసిడెంట్ నేతాజీ స్కూల్ అధినేత ఎం.వి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొని బలరామయ్యగారి విశిష్ట వ్యక్తిత్వాన్ని, సమాజానికి ఆయన చేస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ, షష్టిపూర్తి ఎలా చేసుకోవాలో బలరామయ్య షష్టిపూర్తి కార్యక్రమం ద్వారా మనం తెలుసుకోవచ్చన్నారు. ఎందరో బలరామయ్య ఆత్మీయులు, బంధుమిత్రులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమని, వాకర్స్ కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న నిరంతర సేవా కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయన్నారు. మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు మాట్లాడుతూ, బలరామయ్య తనకు ప్రాణస్నేహితుడని, బల రామయ్య మంచి వ్యక్తిత్వం..మంచి మనసు వున్న వ్యక్తి అని కొనియాడారు. మైథిలి స్కూల్ అధినేత మైథిలి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, బలరామయ్య అందరికీ మిత్రుడని, అజాతశత్రువని ఇది మంచి వ్యక్తికి జరుగుతున్న ఘన సన్మానమని కొనియాడారు. ఈ సందర్భంగా బలరామయ్యగారి జీవితం-మంచి వ్యక్తిత్వం గురించి 'లాయర్' వారపత్రిక సబ్‌ఎడిటర్ మద్దూరు క్లుప్తంగా వివరించారు. తొలుత నలుబోలు బలరామయ్య -శ్రీమతి పద్మావతి దంపతు లను ముఖ్యఅతిథులు, ఆత్మీయులు అందరూ కలిసి వెండికిరీటం.. పూల మాలలతో ఘనంగా సత్కరించారు.



**'బాలమ్మ పుత్ర..బలరామ' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ :**

నలుబోలు బలరామయ్య 60వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, ఈ 60 ఏళ్ళ జీవితంలోని పలు ముఖ్య సంఘటనలతో అత్యద్భుతంగా రూపొందించిన 'బాలమ్మ పుత్ర..బలరామ' ప్రత్యేక సంచికను షష్టిపూర్తి సభకు విచ్చేసిన అతిథులందరి సమక్షంలో, బలరామయ్య మాతృమూర్తి బాలమ్మచే ఆవిష్కరింపజేశారు.

**మురిపించిన 'కళాంజలి'..సంగీతపు సందడి :**

ఈ సందర్భంగా 'కళాంజలి' అనంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీతపు సందడి కార్యక్రమం అందరినీ బాగా అలరించింది. ముఖ్యంగా బలరామయ్య మంచివ్యక్తిత్వాన్ని కొనియాడుతూ 'అందరి బంధువయా' పేరడీగీతం బాగా ఆకట్టుకుంది. ప్రముఖ వేణుగాన విద్వాంసుడు దారా సురేష్ సంగీత సారథ్యంలో అభినవ జేసుదాస్ మల్లికార్జున, వర్ధమాన గాయకుడు నర్సింహ, కృష్ణయ్యలతో పాటు, చిన్నారులు శ్రావణి, రిషితప్రియ, జ్ఞానశ్రీ, ఇందుమాధురి ఆలపించిన సినీగీతాలు అందరినీ బాగా అలరించాయి. సంగీత్ కీ-బోర్డు, శాంతి-తబలా, రిథమ్‌ప్యాడ్ గిరిల సహకారం అత్యద్భుతంగా వుండి సంగీతపు సవ్వడి కార్యక్రమం ప్రేక్షకులను మైమరపించింది. కళాంజలి అనంత్‌తో పాటు బెనర్జీ, ఎస్.కృష్ణకుమార్, విశ్వం, సురేష్ తదితరులు పాల్గొని ఈ సంగీత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.








# వెలువడిన ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్!




ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడింది. ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల తేదీ లను ఎన్నికల సంఘం 6వ తేదీ ప్రకటిం చింది. ఈ నెల 13వ తేదీ నుండి ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేయొచ్చు. 20తేదీ నామినేషన్లకు తుదిగడువు. 21వ తేదీ నామినేషన్‌ల పరిశీలన ఉంటుంది. 23వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ. మార్చి 9వ తేదీ ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 15వ తేదీ ఓట్ల లెక్కింపు ఉంటుంది. 18వ తేదీతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది.

ఈ నెల 6వ తేదీ నుండే జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ప్రజా ప్రతినిధులు కొత్తగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదు. కొత్త అభివృద్ధి పనులను ప్రకటించడానికి వీల్లేదు. ప్రభుత్వ అతిథిగృహాలను వాడుకోవడం కుదరదు. ఇతరత్రా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. ఒకరకంగా చెప్పాలంటే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలయ్యే దాకా జిల్లాలో అధికారుల పాలన నడుస్తుంది. తూర్పు రాయలసీమ(చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు) ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ గత రెండు పర్యాయాలు విజయం సాధించిన యూటీఎఫ్ ఇప్పటికే తన ఇద్దరు అభ్యర్థు లను ప్రకటించింది. గత ఎన్నికల్లో గెలిచిన విఠపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులురెడ్డిలే అభ్యర్థులుగా వున్నారు. వీరికి ప్రధాన పోటీగా తెలుగుదేశం పార్టీ నుండి పట్టభద్రుల నియోజకవర్గానికి వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి పోటీ చేస్తున్నారు. ఆ పార్టీ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. ప్రతిపక్ష వైకాపా మాత్రం ఈ రెండు నియోజక వర్గాల్లో యూటీఎఫ్ అభ్యర్థులకే మద్దతు ప్రకటించింది. ఇంకా పలువురు అభ్యర్థులు ఇండిపెండెంట్లుగా దిగుతున్నప్పటికీ ప్రధానపోటీ మాత్రం యూటీఎఫ్‌కు తెలుగు దేశంకు మధ్య మాత్రమే ఉండబోతోంది.

# విషజ్వరాలపై సమరం

నెల్లూరు రూరల్‌ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈనెల 6వ తేదీ ఆమంచర్లలో ప్రజాబాట నిర్వహించారు. స్థానిక సమస్యలపై ప్రజలతో చర్చించి, పరిష్కారం కోసం అధికారులకు పలు సూచ నలు చేశారు. ఆమంచర్ల హైస్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని, స్వైన్‌ఫ్లూ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ విషజ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయని, వేలాది రూపాయలు హాస్పిటళ్ల రూపంలో ప్రజలు నష్టపో తున్నారని, కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషజ్వరాల అంతానికి అందరం నడుం బిగించాలని, అధికార యంత్రాంగం కూడా యుద్ధ ప్రాతిపదికన అవగాహన శిబిరాలు, వైద్యశిబిరాలను నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో విషజ్వరాల బాధితుల వైద్యచికిత్స కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్వైన్‌ఫ్లూ నివారణ కోసం వాడవాడలా స్వైన్‌ఫ్లూ మందులు పంపిణీ చేస్తున్నామని, ఇందుకు సహకరించిన మినర్వా హోమియో కేర్ అధినేత డా॥ యశ్వంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

# క్యాన్సర్ మహమ్మారిని తరిమికొడదాం




ముందస్తు జాగ్రత్తలు తీసు కోవడం ద్వారా క్యాన్సర్ మహ మ్మారిని తరిమి కొడదామని అపోలో క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ హరిత పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 4వ తేదీ నెల్లూరు హరనాథపురంలోని అపోలో ఆసుపత్రిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌ను నివారించేందుకు ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరముందన్నారు. పొగ త్రాగడం, కాలుష్యం, మారిన జీవనశైలి క్యాన్సర్ పెరగడానికి ప్రధాన కారణాలన్నారు. రోగుల కోసం అపోలో ఆసుపత్రి వారు క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెలాఖరు వరకు స్క్రీనింగ్ ప్యాకేజీకి అదనంగా 20శాతం తగ్గింపుతో క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ అనిత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి పాల్గొన్నారు.

# సాహితీ సర్వసైన్యాధ్యక్షుడు ఏటూరి నాగేంద్రరావు



'ఆయన మాటే కాదు చూపు కూడా వెంటాడుతుంది' అని తనదైన ఒరవడిలో కీ॥శే॥ నాగభైరవ కోటేశ్వరరావును రెండు ముక్కల్లో అభివర్ణించిన ప్రజ్ఞాశాలి ఏటూరి నాగేంద్రరావు. కవిత్వమే ఊపిరిగా అధ్యయనమే ధ్యేయంగా నిత్యం ప్రవహించే కవితోపాసకుడు ఏటూరి నాగేంద్రరావు. నెల్లూరు కవుల్లో అగ్రగామిగా భాసిల్లుతున్న సాహితీవేత్త ఏటూరి. వెన్నెలలో చీకటిని చూడగల సాహితీ సేనాని నాగేంద్ర.

ఆరు కవితాసంపుటాలు ఇప్పటివరకు వెలువరించి ఏడో కవితా సంపుటానికి సిద్ధమవుతున్న నిరంతర సాహితీ వేత్త, నిత్య కృషీవలుడు ఏటూరి! ఏటూరిని వేటూరి అని అభిమానంగా పిలుచుకొన్న వాళ్ళు ఎందరో! కవిత్వానికి ఆయన చిరునామా. కవిత్వమే ఆయన వీలునామా!

నాకు గులాబీలే కాదు.. గులాబీ ముళ్ళన్నా ఇష్టమే! దుఃఖాలను దిగమింగలేని వాడికి సుఖాలనుభవించే హక్కు లేదు! అంటూ మనిషి సుఖదుఃఖాలకు అతీతంగా జీవించాలని చెప్తాడు. సుఖాల్ని ప్రేమించి దుఃఖాలకు క్రుంగిపోకూడదనే సందేశం చెప్తాడు ఏటూరి తన 'పూవులు సమ్మె చేస్తాయి' అనే కవితా సంపుటంలో! పూవుల చేత సమ్మె చేయించగల కవితా వైతాళికుడు ఏటూరి. ఆయన గొప్ప అధ్యయన శీలి. పదాలచేత నాట్యమాడించగలడు. ప్రయోగాలతో హోరెత్తించగలడు. భావ పరంపరల్నీ ప్రయోగించగలడు. 'కన్నీటి తడి తెలియనివాడికి చిరునవ్వు చిందించే వీలు లేదంటాడు'. మనసు ఆర్ద్రతతో నిండని వ్యక్తి సునిశితంగా చిరునవ్వు నవ్వలేడంటాడు. అలాగే కష్టజీవి కాని వ్యక్తి విజయాల చిరునవ్వులు చిందించలేడని మరో భావన.

'పసి కలువల కళ్ళల్లో వాడిపోతున్న పసిడి కలల ప్రపంచాన్ని వీక్షించిన వాళ్ళ గురించి తలవంచి కృతజ్ఞతలు ప్రకటిస్తున్నాను.' వాడిపోతున్న భవితకు పునాది వేసే హృదయమున్న వాళ్ళకు సలామంటాడు కవి. తాను గులామునంటాడు. వారికి కృతజ్ఞత ప్రకటిస్తాడు. ఇలాంటి మహోన్నత భావాల్ని ప్రకటించగల సత్తా ఉన్న కవి ఏటూరి. సహృదయకవి నాగేంద్ర.

'దిగులు దిగులుగా ఉన్న కాలాన్ని ఒంటికి చుట్టుకొని నడవాలని ఉంది. అమ్మ చెట్టు నీడకి అంకితమీయాలని ఉంది' అంటూ అమ్మతనాన్ని అభిషిక్తించిన సమున్నత భావజాలం ఈయన సొత్తు. ఏ కవిత రాసినా, ఏ వ్యాసం రాసినా సగర్వంగా, నిగూఢంగా నినదించగల కవి సాహితీ రవి ఏటూరి.

ఓసారి హాస్య కవి సమ్మేళనం కోసం రాసిన కవిత అందర్నీ గిలిగింతలు పెడ్తుంది. ముక్కుంటే ముక్కెర ఉచితం అంటూ హాస్యాన్ని పలికించాడు కవి. ఇలా భారాల తోరణాలు కట్టి సమాజ చైతన్యానికి 'నేను సైతం' అంటూ తొడగొట్టి భావావేశంలో దుముకుతున్న కవి ఏటూరి.

పెన్నానది నీళ్ళు తాగి పరవశించి పరిమళించిన చక్కని కవిత్వాన్ని వెలువరించిన కవి ఏటూరి నాగేంద్రరావు. కవిత్వాన్నే కాదు నాటకాన్ని ఔపోసన పట్టిన వ్యక్తి నాగేంద్రరావు. నాటకాలన్నా ఇష్టం. కవిత్వమన్నా ప్రాణం. ఇలా ఎన్నో కోణాల్ని తనలో ఇముడ్చుకొని సాగుతున్న శివ శంకరుడు నాగేంద్రుడు.

ఎస్.వి.ఎస్.ఆర్ నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా సాహితీ సేవ చేస్తున్న కవే కాదు, సాహితీ సర్వసైన్యాధ్యక్షుడు ఏటూరి. నిరంతరం సాహిత్యమై ప్రవహిస్తున్న కవి నాగేంద్ర. అటు సాహితీ వ్యవసాయాన్ని సాగిస్తూ ఇటు తన ఉద్యోగాన్ని సద్యోగంగా మలచుకొన్నారు నాగేంద్ర. ఆయనకు రావి రంగారావు కళాపీఠం జనరంజక కవితా పురస్కారం ప్రకటించింది. పూవులు సమ్మె చేస్తాయి కవిత్వానికి అందలం వేసింది. ఈ సందర్భంగా ఏటూరికిది అభినందన మాల. ఆత్మీయ తోరణం. ఆయన కవిత్వం మరింతగా వెలువడాలని 'లాయర్' ఆకాంక్ష!

**ఏటూరికి రావి రంగారావు జనరంజక అవార్డు సందర్భంగా...**

- చిన్ని నారాయణరావు

### బాణాసంచా కేంద్రాల్లో...
## టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

నెల్లూరులోని పొర్లుకట్ట ప్రాంతంలో బాణాసంచా తయారీ, విక్రయ కేంద్రాల్లో 4వ తేదీ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. గత ఏడాది డిసెంబర్ 31న పొర్లుకట్ట వద్ద అనధికార బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి 14మంది మృత్యువాత పడ్డారు. ఇలాంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీసు, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బృందాలు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా పొర్లుకట్ట వద్ద గల బాణాసంచా తయారీ, విక్రయకేంద్రాల్లో బృందం తనిఖీలు నిర్వహించింది. 3వ నగర ఇన్స్‌పెక్టర్ పాపారావు, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, కార్పొరేషన్ డి.ఇ రమణారెడ్డి, విఆర్‌ఓ షాజహాన్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

### పుట్టంరాజువారి కండ్రిగలో
## ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు



గూడూరు మండలం పుట్టంరాజువారి కండ్రిగలో వెంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, తానంకి నానాజీ సోమవారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ఆలయంలో సంప్రదాయబద్ధంగా విశేషపూజలు నిర్వహించారు.

## బ్యాడ్మింటన్ పోటీల సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయకుమార్‌రెడ్డి

ఈ నెలలో అంతరాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ది యంగ్ గూడూరు షెటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆ సంఘం గౌరవాధ్యక్షుడు చేవూరు విజయమోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ భారతదేశంలోని అన్ని జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ పోటీలను వైయస్ఆర్ పార్కులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జమాలుల్లా, ప్రధానకార్యదర్శి గిరిబాబు, కార్యదర్శి గవాస్కర్‌రెడ్డి, కార్యదర్శులు కోదండపాణి, దుర్గాప్రసాద్, సభ్యులు సాయి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం
**- డాక్టర్ రోహిణి**




చెక్కును అందజేస్తున్న ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు

రెడ్‌క్రాస్ సంస్థ సేవలు అభినందనీయమని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి అన్నారు. ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రెడ్‌క్రాస్ సంస్థకు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాంకిరణ్ జన్మదినం సందర్భంగా ఇంతటి మంచిపని చేయడం సంతోషమని తెలిపారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతా రెడ్డి, ఆంధ్ర మహిళామండలి అధ్యక్షురాలు సౌందర్యమ్మ, డాక్టర్ సి.ఆర్.రెడ్డి, డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు సురేంద్రరెడ్డి, సుందరరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు, జాన సుధీర్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## సమస్యలు వెంటనే పరిష్కరించండి
**- తహశీల్దార్ వెంకటేశ్వర్లు**



ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని గూడూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. ప్రజావిజ్ఞప్తుల దినం కార్యక్రమంలో భాగంగా ఆయనకు పలు మండలాల ప్రజలు తమ సమస్యలతో అర్జీలు సమర్పించగా ఆయన స్పందిస్తూ... సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## చెక్‌పోస్టులో సి.సి కెమేరాలు

నెల్లూరుజిల్లా తడ మండలంలోని బి.వి.పాలెం చెక్‌పోస్టులో అత్యాధునిక సి.సి కెమేరాలను ఏర్పాటు చేయనున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ డి.సి కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం బి.వి.పాళెం చెక్‌పోస్టులో వాహనాల తనిఖీలపై ఏ.ఓ రవికుమార్‌తో చర్చించారు. ఈ మార్గంలో వీధి దీపాలు, అత్యాధునిక సి.సి కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామని, వాహనాలు ఆగకుండా వెళ్లిన వెంటనే కెమేరాలు సమాచారాన్ని సేకరించి సెల్ ఫోన్ మెసేజ్ ద్వారా ఏఓను అలర్ట్ చేస్తాయని తెలిపారు.

### మాలవ్యానగర్‌లో
## విద్యుత్తు దీపాలు

గూడూరు రెండో పట్టణంలోని మాలవ్యానగర్ కూడలి వద్ద సెంట్రల్ లైటింగ్‌ను మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దగ్గరుండి సోమవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్ళు, వార్డుల్లో ఎక్కడా ఏ సమస్యా లేకుండా పనులు చేయించేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నిరసన

గూడూరు పట్టణంలోని రెండు ప్రభుత్వ ఆసుపత్రుల మధ్య ఉన్న దారిని తెరవాలని సిపిఐ డివిజన్ కార్యదర్శి యాదగిరి కోరారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఐ నాయకులతో కలసి నిరసన తెలిపి ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే పేద ప్రజలు దారిని మూసివేయడం పట్ల ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.వి.రమణయ్య, శివకుమార్, పద్మావతి, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# కన్నీళ్ళు పెట్టుకున్న నెల్లూరు దేశం నేతలు

గల్పిక

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల ఉత్పత్తి కేంద్రమైన నెల్లూరు నగరం. కాపువీధిలోని స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఇల్లు. "అమ్మడు లెట్స్ కుమ్ముడు" అనే 'ఖైదీ నెం.150' సినిమాలోని పాట రింగ్‌టోన్‌తో వివేకా సెల్ మోగింది. నిద్రమత్తులో వివేకా కళ్లు తెరచి సెల్ వైపు చూసాడు. నైట్‌రైడర్, ముదురుదోమల మంత్రి నారాయణ నుండి ఫోన్... ఈ అయ్యవారికి నిద్ర రాదు, నిద్రపోయేవాళ్లను ప్రశాంతంగా పడుకోనీయడు అని వివేకా మనసులో తిట్టుకుంటూ ఫోన్ ఎత్తాడు. వివేకన్నా, అర్జంట్‌గా ఒకసారి మన ఇంటి దాకా రాకూడదా అని అవతల నుండి నారాయణ అడిగాడు. వివేకా దానికి... ఇంత అర్ధరాత్రి అంత అర్జంట్ పనేంటని అడిగాడు. నారాయణ అందుకు... ఇది అర్ధరాత్రా? సూర్యుడు నెత్తిమీదకొచ్చున్నాడు. ఇంతకీ నువ్వేదేశంలో ఉన్నావని అడిగాడు. వివేకా ఆశ్చర్యంగా... నేను నెల్లూరులోనే నా బెడ్‌రూంలో ఉన్నాను, కాకపోతే నాకు అంతా చీకటిగా వుంది అంటూ కళ్లు తడుముకున్నాడు. ఆయన కళ్లకు వున్న నల్లద్దాలు చేతికి తగిలాయి. వివేకాకు విషయం అర్ధమైంది. నల్లద్దాలు పక్కనపెట్టేసి రెడీ కావడానికి బాత్రూంలోకి దూరాడు.

★★★★★

మంత్రి ఇంట్లో ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు ఉన్నారు. అప్పుడే వివేకా కూడా వచ్చాడు. వివేకా అందరివైపు చూసాడు. అందరి ముఖాల్లోనూ విచారం కనిపిస్తోంది. వివేకా వారితో... ఏంటి, బంగాళాఖాతంలో అందరివీ తలా ఒక షిప్ మునిగిపోయినట్లు ఫేస్‌లు పెట్టి వున్నారు. ఏమైందని అడిగాడు. వెంటనే నారాయణ చెప్పడం కాదు చూపిస్తాను ఉండూ అంటూ ఒక సి.డిని పెట్టి టీవీ ఆన్ చేశాడు. టీవీ స్క్రీన్ మీద సీన్ మొదలైంది.

నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్... మేయర్ అజీజ్ ప్రెస్‌మీట్... అజీజ్ మాట్లాడుతున్నాడు. ఈమధ్య నెల్లూరులో జరుగుతున్న రాజకీయ పరిణామాలన్నీ మీకు తెలుసు... అభివృద్ధిలో నెల్లూరు నగరాన్ని జెట్ వేగంతో ముందుకు తీసుకెళుతున్నాను. నేను చేస్తున్న అభివృద్ధి చూసి చంద్రబాబే ఆశ్చర్యపోతున్నారు. అజీజ్ ఏంట్రా, ఇంత యాక్టివ్‌గా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాడు, ఇతనేమన్నా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నాడా? అనే అనుమానం మీకు రావచ్చు. మీకు వచ్చిన అనుమానం కరెక్టే... యస్... నేను వచ్చే ఎన్నికల్లో నెల్లూరు అసెంబ్లీ నుండి పోటీ చేయబోతున్నాను. చంద్రబాబు, లోకేష్‌లు నన్ను ఒకటే బ్రతిమలాడుతున్నారు పోటీ చేయమని. వారి బాధ చూడలేకే నేను పోటీ చేయాలనుకుంటున్నాను, నేను పోటీ చేయడమే కాదు, జిల్లాలోని పది అసెంబ్లీ సీట్లలో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తాను అని చెపుతుండగా... 'ఈరోజు' పత్రిక విలేకరి వుండి... సార్, మీపై మంత్రి నారాయణ ఆగ్రహించారట కదా, ఎందుకు? అని అడిగాడు. అందుకు అజీజ్, ఆ అయ్యవారికి అంత సీన్ లేదు, ఆయనేమన్నా లెక్చరరా, నేను స్టూడెంట్‌నా? ఆయన సొమ్మేదన్నా తెచ్చి నాకు పెట్టాడా... ఆయన నాపై కోప్పడ్డానికి... నేను భయపడడానికి అని బదులిచ్చాడు. టీవీ 10.5 విలేకరి వుండి... ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల విషయంలో సోమిరెడ్డి, ఆదాల, ముంగమూరులతో విబేధాలున్నాయట కదా? అని ప్రశ్నించాడు. అందుకు అజీజ్... మీరు సింహానికి చిట్టెలుకలకు పోటీ పెడుతున్నారు. నా ముందు వాళ్లెంత ఆఫ్టాల్, అయినా నాతో విభేదాలు పెట్టుకునే స్థాయికి వాళ్లింకా ఎదగలేదు. చంద్రబాబుతో అజీజ్‌కు విబేధాలు అనండి... కరెక్ట్! లేదా వెంకయ్యనాయుడుతో విబేధిస్తున్న అజీజ్ అని రాయండి రైట్... ఈ గల్లీ లీడర్లకు నాకూ పోటీ ఏంటి అని ప్రెస్‌మీట్ ముగించాడు. అక్కడితో సి.డి అయిపోవడంతో నారాయణ టీవీ ఆఫ్ చేసాడు. వివేకా అందరి వైపు చూసాడు... అందరి కళ్లల్లోనూ నీళ్లు తిరుగుతున్నాయి... నారాయణ, వివేకాతో... నీకు అసలు హృదయం లేదా? ఆ అజీజ్ అన్న మాటలకు మా గుండెలు ముక్కలయ్యాయి. ఏడుపు తన్నుకొస్తోంది, కానీ నీకున్నది గుండె కాదు బండ... అందుకే అలా ఎలాంటి చలనం లేకుండా వున్నావని ఆవేదనగా ప్రశ్నించాడు. అప్పుడు వివేకా... ఈ సీన్‌లు చూసాక బండలాంటి నా గుండె కూడా ముక్కలైందంటూ కళ్లకున్న నల్లద్దాలు తీసాడు. ఆశ్చర్యం... వివేకా కళ్లల్లో కూడా కన్నీళ్లే! అందరూ ఆశ్చర్యంగా... నువ్వు కూడా కన్నీళ్లు పెట్టుకుంటున్నావా? అని అడిగారు. అప్పుడు వివేకా... నా రాజకీయ చరిత్రలో ఇంతటి ఘోరాన్ని ఎప్పుడూ చూడలేదు. నేదురుమల్లి, నల్లపరెడ్డి, మాగుంట, మేకపాటి, బెజవాడ వంటి రాజకీయ కుటుంబాలను ఎదుర్కొన్నాం... ఎప్పుడూ ఇలాంటి అనుభవం ఎదురు కాలేదు. ఈ తొట్టి పిచుక అజీజ్ చేతిలో ఇంత అవమానమా? మనం ఇంత మంది కొమ్ములు తిరిగిన నాయకులం వుంటే జిల్లాలో పదిసీట్లను ఆయన గెలిపిస్తాడా... అని వివేకా అన్నాడు. అతను ఎందుకలా మాట్లాడుతున్నాడని నారాయణ అడిగాడు. అప్పుడు వివేకా... ఇది థర్డ్ స్టేజ్ ఆఫ్ హెల్లోసినేషన్... అతనిలో ఆత్మవిశ్వాసం పాళ్లు ఎక్కువయ్యాయి. ఆ ట్రాన్స్‌లోకి వెళ్లిన వాళ్లు జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనే పార్టీని గెలిపిస్తామని, తాను మంత్రినవుతానని, నెల్లూరును రాష్ట్రంలోనే అభివృద్ధి పథంలో నడుపుతానని, నెల్లూరులో ఒక్క ముదురుదోమను కూడా లేకుండా చేస్తానని చెబుతుంటాడు... కాలం గడిచేకొద్దీ అతనిలో ఈ ఆత్మవిశ్వాసం పాళ్లు ఎక్కువై... ఈ రాష్ట్రానికి కాబోయే సీఎం తానేనని చెప్పుకున్నా ఆశ్చర్యం లేదన్నాడు. ఇప్పుడే అజీజ్ వ్యవహారం సీఎంకు చెబుతానంటూ నారాయణ ఫోన్ చేసాడు. అవతల చంద్రబాబు ఫోన్ ఎత్తాడు. నారాయణ అజీజ్ వ్యవహారమంతా చెప్పాడు. అంతా విన్న చంద్రబాబు... నాకిప్పుడు నెల్లూరు గురించి పట్టించుకునేంత తీరిక లేదు. అవతల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నా అపాయింట్‌మెంట్ కోసం వెయిట్ చేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ లాగా అమెరికాను అభివృద్ధి చేయాలంట... ఇంకో పక్క ఇంకో ఆరునెలల్లో అమరావతిని సింగపూర్‌లాగా చేసేయాలి... ఢిల్లీ నుండి చూస్తే ఐదు రాష్ట్రాల ఎన్నికల నుండి ఎలా గట్టెక్కాలో చెప్పి పుణ్యం కట్టుకోండని ప్రధాని మోడీ బతిమలాడుతున్నాడని చెప్పి పెట్టేసాడు. చంద్రబాబు మాటలు విన్నాక అందరికీ ఒక విషయం అర్ధమైంది... అజీజ్ మాటల్లో ఏం తప్పులేదని!

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆదాయం తృప్తికరంగా ఉండదు. ఖర్చులు పెరిగిపోతాయి. అదుపు ఉండదు. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. కుటుంబంలోనే చిన్నచిన్న మనస్పర్ధలు, వస్తు నష్టం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. పనులు నిదానంగా జరుగుతాయి. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. బంధు మిత్రుల సహాయసహకారాలు బాగుంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్ధిక లావాదేవీలను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. ముఖ్య పనులను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. ఆత్మీయంగా మెలిగేవారు, సన్నిహితుల వల్ల కొద్ది సమస్యలుండ గలవు. అధికారుల సహకారం ఉద్యోగులకు బాగుంటుంది. మొగమాటాలకు, ప్రలోభాలకు లొంగవద్దు. కొత్త వస్తువులు, గృహోపకరణలు సమకూరుతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఇంటా బయట వ్యవహారాలలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతారు. రావలసిన బాకీలు కొంత లభించడం, కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం జరుగుతుంది. బంధుమిత్రుల సహకారం బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులలో జాప్యం కలదు. కొత్త పెట్టుబడులు, వ్యాపార వృద్ధి కృషి ఫలిస్తుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్ధికంగా బలపడి వృత్తి వ్యాపారాలు లాభసాటిగా జరుగుతాయి. ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలలో పాల్గొనడం, కొత్త పెట్టుబడులు, వ్యాపారవృద్ధి ప్రయత్నాలు కలిసివస్తాయి. వార ప్రారంభంలో పనులు నిదానంగా జరుగుతాయి. బంధుమిత్రుల రాకపోకలు ఇబ్బందిని కలిగించగలవు. అనవసర విషయాలలో తల దూర్చవద్దు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఖర్చులు ఎక్కువుగా ఆర్ధిక ఇబ్బందులుంటాయి. ఆశించిన రీతిలో వ్యాపార ప్రగతి ఉండదు. స్థిరాస్తుల లావాదేవీలు, వ్యాపార పెట్టుబడులు వాయిదా వేసికొనండి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ముఖ్య విషయాలందు నిర్ణయం తీసికొనవలసి వస్తే అనుభవపరులను సంప్రదించడం మంచిది. అనుకున్న పనులు సరిగా జరగవు. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

స్థిర నిర్ణయాలు తీసికొనలేక ఆందోళన చెందుతారు. జరుగుతున్న వ్యాపారాలు, వృత్తి నిర్వహణలో సంతృప్తి ఉంటుంది. కుటుంబంలో వ్యక్తులకు అనారోగ్య బాధలుంటాయి. ఇంటా బయట వ్యవహారాలను జాగ్రత్తగా నిర్వహించండి. శుభకార్యాలలో పాల్గొంటారు. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. విద్యా వృద్ధికి గట్టి కృషి జరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 10.2.2017 నుండి
తేది. 16.2.2017 వరకు

ఈ వారం కర్కాటక సింహ తుల కన్యా రాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, మకరంలో రవి బుధులు, 12తేది నుండి కుంభంలో రవి, కుంభంలో కేతువు, మీనంలో కుజశుక్రులు సంచరిస్తారు.

పంచాంగము
ముహూర్తములు

తేది 15 బుధవారం రాత్రి గంట 11.40 నుండి గంట 1.49 వరకు వృశ్చికలగ్నమున వివాహ, గృహప్రవేశములు.

### మాఘమాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 10 | శుక్ర | చతుర్దశి | ఉ॥ గం.7.30వ॥ |
| | పిదప | పూర్ణిమ | పూర్తిగ |

### మాఘమాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | శని | పాడ్యమి | రా॥ గం.5.42 వ॥ |
| తేది. 12 | ఆది | విదియ | రా॥ గం.5.08వ॥ |
| తేది. 13 | సోమ | తదియ | రా॥ గం.5.25వ॥ |
| తేది. 14 | మంగళ | చతుర్థి | పూర్తిగ |
| తేది. 15 | బుధ | పంచమి | పూర్తిగ |
| తేది. 16 | గురు | పంచమి | ఉ॥ గం.7.30వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఖర్చులు అధికమై అదుపు ఉండదు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. బంధువర్గం సోదర వర్గం నుండి ఆర్ధికమైన, వ్యవహారికమైన ఇబ్బందులుంటాయి. కోర్టు కేసులు వాయిదా పడతాయి. బాకీలు నిలబడిపోతాయి. విద్యార్థులు బాగా శ్రద్ధపెట్టి చదువవలసి ఉంటుంది. ఋణాలు, హామీలు ఇవ్వవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఎక్కువ ఖర్చులుండినా ఆర్ధిక ఇబ్బందులుండవు. వృత్తి వ్యాపారాలు వేగవంతమై ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. వ్యవహారాలలో సామరస్య ధోరణిని పాటించండి. కొత్త వస్తువులు, గృహోపకరణాలు సమకూరుతాయి. ఉద్యోగార్థులకు చిన్న అవకాశాలుంటాయి. విద్యాప్రగతి బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కొత్త వ్యాపార ప్రయత్నాలు, పెట్టుబడుల ప్రయత్నాలు ఫలించగలవు. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలుంటాయి. వృత్తి పరంగా ఆదాయం పెరుగుతుంది. ఆర్థికాభివృద్ధికై ప్రణాళికలు అనుకూలించగలవు. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. అనుకోని ప్రయాణాలుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ఫలించడం, మంచి సమాచారం లభించి మనసు కుదుట పడుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

బయట వ్యవహారాలైనా, ఆర్ధిక వ్యవహారాలైనా చక్కని ప్రణాళికలతో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. కొద్దిపాటి అనవసర ఖర్చులుంటాయి. సోదరుల కుటుంబాలకు మంచి జరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరిపేవారికి అనుకూలత కలదు. అనుకోని ప్రయాణాలు, రావలసిన బాకీలు కొంత లభించడం జరుగుతుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కొత్త పెట్టుబడి అవకాశాలు, భాగస్వామ్య అవకాశాలు లభించకపోవచ్చును. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. కోర్టు కేసులు వాయిదా పడటం, గత విషయాలపై బంధువులతో విభేదాలు ఏర్పడవచ్చును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఇతరులతో వ్యవహారాలు జరిపేటప్పుడు మాట తొందరపాటు, దూకుడు తగ్గించుకొనండి. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు.


## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్ధికంగా బాగుంటుంది. రావలసిన బాకీలు లభించగలవు. వృత్తి వ్యాపార వ్యవసాయాలు వేగవంతమై ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. దూర ప్రయాణాలుంటాయి. కొత్త వస్తువులు సమకూరుతాయి. కొత్త పరిచయాలు బలపడగలవు. ఏదో ఒక విధంగా అనుకున్న పనులు జరుపుకొంటారు. ఉద్యోగులకు అధికారుల అనుకూలత బాగుంటుంది.

# కళ్యాణ వైభవం...!



తెలుగు సినీ రచయిత వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ - ప్రమీలల కుమారుడు **రాకేందు మౌళి - శిల్ప** (భీమవరం వాస్తవ్యులు పాలకోడేటి రామం - స్వర్గీయ శ్రీలతల కుమార్తె)ల కల్యాణం ఈ నెల 1వ తేదీ హైదరాబాద్, మాదాపూర్‌లోని ఇమేజ్‌గార్డెన్స్ నందు వైభవంగా జరిగింది. సినీ నేపథ్యగాయకులు పద్మభూషణ్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంతో పాటు పలువురు సినీ, రాజకీయరంగ ప్రముఖులు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. కొత్తజంటకు 'లాయర్' శుభాకాంక్షలు.



ఉదయగిరి మాజీశాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి - అనసూయమ్మల కుమారుడు **కొండారెడ్డి - సాకేతరెడ్డి** (భార్గవీ ఆటోమొబైల్స్ అధినేత కొండా బలరామరెడ్డి మనుమరాలు, భీమిరెడ్డి శాంతకుమార్‌రెడ్డి - నీరజమ్మల కుమార్తె)ల వివాహం ఈ నెల 2వ తేదీ నెల్లూరు ధనలక్ష్మీపురంలోని కె.జి.కె. కళ్యాణ మండపం నందు జరిగింది. మంత్రి నారాయణతో పాటు వివిధ రంగాల ప్రముఖులు విచ్చేసి వధూవరులను దీవించారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

# జగన్‌కు ఆవేశం ఎక్కువ... ఆలోచన తక్కువ!

**- సోమిరెడ్డి విమర్శ**



రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకునిగా వుంటూ, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఎలాంటి అవగాహన లేకపోవడం విచారకరమని వైఎస్సార్సీపి అధినేత జగన్మోహన్‌రెడ్డి తీరుపై టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

ఈ నెల 5న ఆయన నెల్లూరులోని ఎన్టీఆర్‌భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జగన్‌కు సిఎం కుర్చీ కావాలనే ఆరాటం తప్ప, కీలక అంశాలపై కూడా ఎలాంటి అవగాహన కల్పించుకోవడం లేదని, ఇది ఆయన తీరుకు నిదర్శనమని విమర్శిం చారు. కాంగ్రెస్ హయాంలో ఉమ్మడిరాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం 60 నెలల్లో 53వేల కోట్లు వెచ్చిస్తే, తమ ప్రభుత్వం కేవలం 13 జిల్లాల్లో 30 నెలల్లోనే 22 వేల కోట్లు ఖర్చుచేసిందన్నారు. అప్పట్లో కాలువల్లో మట్టి తీసి వేల కోట్లు స్వాహా చేసినట్లు కాగ్ తన నివేదికల్లో వెల్లడించిందని గుర్తుచేశారు. అంతేకాదు, శ్రీశైలం నుంచి రాయలసీమకు 30 శాతం తాగునీటిని తీసుకొచ్చిన ఘనత సిఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. చీటికీమాటికీ టిడిపిని బంగాళాఖాతంలో కలపాలంటూ విమర్శిస్తున్న జగన్ బంగాళాఖాతానికి బ్రాండ్ ఎంబాసిడర్‌గా వున్నట్లుందని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టిడిపి నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభ్యంతరాలుంటే తెలపండి



పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల నియోజకవర్గాల ఎన్నికలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల నియోజకవర్గాల ఎన్నికలపై గుర్తింపు పొందిన రాజకీయపార్టీల జిల్లా స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లు మరొక పోలింగ్‌స్టేషన్ పరిధిలో వుంటే మార్పులు చేస్తామన్నారు. మొత్తం 80 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పట్టభద్రుల నియోజకవర్గంలో పురుషులు 49,252, స్త్రీలు 26,242 మంది, ఉపాధ్యాయుల నియోజకవర్గంలో పురుషులు 3,850, స్త్రీలు 2,127 మంది ఓటర్లుగా వున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎ.ఎం.డి ఇంతియాజ్‌అహ్మద్, జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణభారతి, మాజీ శాసనసభ్యులు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, సిపిఎం నాయకులు మోహన్‌రావు, దయాకర్, టిడిపి నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రోత్సాహం అందిస్తా...

**- ప్రముఖదాత వేమిరెడ్డి**



క్రీడలకు తనవంతు ప్రోత్సాహాన్ని అందిస్తానని విపిఆర్ ఫౌండేషన్ అధినేత, ప్రముఖదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు ఏ.సి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్, టేబుల్‌టెన్నిస్ ఇండోర్ స్టేడియంలో సెకెండ్ ఏపి స్టేట్ చెస్ ఛాంపియన్ షిప్ ఆఫ్ ది డెఫ్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏ.సి.సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ రవిప్రభ మాట్లాడుతూ దివ్యాంగులు, సకలాంగులతో సమానంగా క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.వి.రమణయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, ఆల్‌ఇండియా స్పోర్ట్ కౌన్సిల్ ఆఫ్ ది డెఫ్, న్యూఢిల్లీ వైస్‌ఛైర్మెన్ పి.వెంకట్రావ్, వికలాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి.నరసింహులు, స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆఫ్‌ది డెఫ్ ఆంధ్రప్రదేశ్(విజయవాడ) అధ్యక్షకార్యదర్శులు ఎం.వాసుదేవరెడ్డి, వైయస్ఆర్ ప్రసాద్, కోశాధికారి బి.బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓవరాల్ ఛాంపియన్ గుంటూరు

రాష్ట్ర స్థాయిలో ఏడు రౌండ్లలో జరిగిన చెస్ పోటీల్లో అత్యధిక పాయింట్లు(14.5) సాధించిన గుంటూరుజిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ద్వితీయ స్థానంలో వై.యస్.ఆర్. కడప జిల్లా జట్టు(12.5), నెల్లూరుజిల్లా జట్టు 12పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచింది.

**పురుషుల విభాగంలో...** కె.కృష్ణారెడ్డి(5.5పాయింట్లు), గుంటూరు, జె.లక్ష్మీకిషోర్(5), వైయస్సార్ కడప, జి.సాయిసందీప్‌కుమార్(4.5), వైయస్సార్ కడప, జి.శివశంకర్‌రావు(4.5), కాకినాడ, వి.ఓబులేసు(4), అనంతపురంలు మొదటి ఐదు స్థానాల్లో నిలిచారు.

**మహిళల విభాగంలో...** జి.భారతమ్మ(9), నెల్లూరు, ఎం.బాలనాగజ్యోతి(8), గుంటూరు, ఎన్.ధరణి కుమారి(7), వైయస్సార్ కడప, పి.మీనాకుమారి(6), చిత్తూరు తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు.



# శ్రీకాళహస్తి న్యూస్

## నేత్రపర్వంగా..

# శ్రీకాళహస్తీశ్వరునికి మహాకుంభాభిషేకం



స్వర్ణముఖి నది ఒడ్డున వున్న మహాపుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయం మహాకుంభాభిషేక మహోత్సవాలతో కళకళలాడింది. స్వర్ణకాంతులీనే గోపురాల శోభతో, వేదపండితుల వేదమంత్రోచ్ఛటనలతో, స్వామివార్లకు నిర్వహించిన శోభాయమానమైన అలంకారాలతో ఆలయమంతా ఉత్సవశోభతో అలరారింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాకుంభాభిషేకాలు జరగడం అరుదైన విషయమే.

12వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయంలో గత 9 వందల ఏళ్ళ చరిత్రలో కేవలం నాలుగుసార్లు మాత్రమే కుంభాభిషేకం నిర్వహించారు. ఈనెల 8వ తేది జరిగిన మహాకుంభాభిషేకం అయిదవది. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్రసరస్వతి పర్యవేక్షణలో రుత్విక్కులు, వేదపండితులు ఈ కుంభాభిషేకాన్ని మహాద్భుతంగా నిర్వహించారు. ఉదయం 6గంటలకు కలశాలతో పవిత్రజలాలను ఆలయ అర్చకులు రాజేష్ గురుకుల్ తీసుకుని రాగా, కంచికామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివార్లకు ఎంతో భక్తిశ్రద్ధలతో అభిషేకపూజలు నిర్వహించారు. ఆగమశాస్త్ర ప్రకారం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలోని వివిధ గోపురాలకు 96 బంగారు కలశాలను అలంకరించి అంతా స్వర్ణమయం చేశారు. స్వామివారి ధ్వజస్తంభం బంగారు తాపడంతో దివ్యంగా..స్వర్ణమయంగా వుండి స్వర్ణకాంతులతో శోభిల్లింది. ఈ మహాకుంభాభిషేకంలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్ అనూరాధ, ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, శ్రీమతి ప్రశాంతి, ఎమ్మెల్యే సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు, ప్రముఖ కాంట్రాక్టర్ గంగాప్రసాద్, ఆలయ ఇ.ఓ భ్రమరాంబ, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట గురవయ్యానాయుడు, ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్, మల్లెమాల ప్రమీలమ్మ, కండ్రిగ ఉమ, కాసరం రమేష్, ఎం.లోకనాథం నాయుడు, ఎం.నారాయణ, అత్తింజేరి బాలాజీ, కోనేటి సిద్ధులయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు 'దేశం'లో... నేతల కల్లోలం!

(మొదటి పేజీ తరువాయి)

కేవలం 3 అసెంబ్లీ సీట్లను మాత్రమే గెలిచింది. అది కూడా వైకాపా వాళ్ల స్వయం కృతాపరాధం వల్ల! తెలుగుదేశం అధికారంలోకి వచ్చినా జిల్లాలో ఇంతవరకు పార్టీ బలపడే పనులేవీ జరగలేదు. కాంగ్రెస్ నాయకులను, ఒక వైసిపి ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకున్నా, దానివల్ల పార్టీకి కలిగే ప్రయోజనం పెద్దగా లేదు. జిల్లా మంత్రిగా నారాయణ ఉన్నప్పటికీ పార్టీ పటిష్టత కోసం ఆయన ఏ మాత్రం పని చేయడం లేదు. సోమిరెడ్డి లాంటి సీనియర్ నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించకపోవడంతో కేడర్‌లో నిస్తేజం నెలకొంది.

జిల్లాలో ఇంత వరకు కూడా పార్టీ పరిస్థితి నిరాశాజనకంగానే వుంది. కాగా తాజాగా జిల్లాలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు పార్టీలో కలవరం పుట్టిస్తున్నాయి. నెల్లూరుజిల్లా స్థానిక శాసనమండలి పార్టీ టిక్కెట్ తెలుగుదేశం నేతల మధ్య చిచ్చు రగిల్చింది. ఈ టిక్కెట్ నాదేనంటూ ప్రస్తుత ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి చెప్పుకుని తిరుగుతుండగా, ఇదే సీటు కోసం మాజీఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం వివేకానందరెడ్డిలు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. వాకాటికి సీటిస్తే వైకాపాకు పండుగ. ఖచ్చితంగా గట్టి పోటీ ఇస్తారు. అదే ఆదాల అయితే గెలుపుకు ఢోకా లేదు. ఈ ఎమ్మెల్సీ టిక్కెట్ పోటీ పార్టీలో కుమ్ములాటలకు కేంద్రంగా మారింది. ఇక జిల్లాలో ముఖ్యమైన నాయకులను సంప్రదించకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడం కూడా విభేదాలకు దారితీస్తోంది. ఇటీవల పార్టీ కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో ఎవరిని అడిగి అభ్యర్థిని నిర్ణయించారంటూ మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి బహిరంగంగానే తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఇక నెల్లూరు కార్పొరేషన్ చూస్తే అధికారపక్షం, విపక్షం అంతా తెలుగుదేశం వాళ్లే! కార్పొరేషన్ కేంద్రంగా తెలుగుదేశంపార్టీలోనే ఐదు గ్రూపులు ఏర్పడ్డాయి. మేయర్ అజీజ్ ఏ ఒక్కరినీ పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడు. మేయర్ వైఖరితో మిగిలిన నాయకులు విసుగెత్తిపోతున్నారు. ఆనం వర్గీయులు మేయర్‌పై ప్రత్యక్షంగానే ఎదురుదాడికి దిగుతున్నారు. అటు మేయర్‌కు ఇటు మేయర్ వ్యతిరేకులకు మధ్య మంత్రి నారాయణ నలిగిపోతున్నాడు. కార్పొరేషన్ వేదికగా తెలుగుదేశం నాయకులు వీధికెక్కి కొట్టుకుంటున్నారు. అలానే కోవూరు నియోజక వర్గంలో చూస్తే ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి వ్యతిరేకంగా అసమ్మతి వర్గం పావులు కదుపుతోంది. గూడూరులో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, బల్లి దుర్గాప్రసాద్, డాక్టర్ టి.జ్యోత్స్నలతలు ఎవరి గ్రూపులు వాళ్లు నడుపుకుంటున్నారు. సూళ్లూరుపేటలో వేనాటి రామచంద్రారెడ్డి ఓవైపు, వాకాటి, గంగాప్రసాద్‌లు ఓ వైపు వర్గ రాజకీయాలు నడుపుతున్నారు. వెంకటగిరిలోనూ ఎమ్మెల్యే కురుగొండ్ల ఒంటెత్తుపోకడలు నచ్చక కొందరు నాయకులు అసంతృప్తితో ఉన్నారు. మొత్తానికి జిల్లా తెలుగుదేశం గందరగోళంగా తయారైందని చెప్పొచ్చు.

# చేస్తాడా? వాయిదా వేస్తాడా?

(మొదటి పేజీ తరువాయి)

నెల్లూరుజిల్లాలో తన అనుచరుడు మంత్రి నారాయణకు ఇబ్బంది లేకుండా సీనియర్ నాయకుడైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని శాసనమండలి ఛైర్మన్‌గా పంపిస్తే రెడ్ల ప్రాబల్యంగల జిల్లాల్లో లెక్క సరిపోతుంది. ఒక్క కడపజిల్లాలో మాత్రం లోటుంటుంది. వీరితో పాటు పార్టీలో సీనియర్లైన పయ్యావుల కేశవ్(అనంతపురం)కు కూడా మంత్రి వర్గంలో స్థానం దక్కవచ్చు. ఇక మైనార్టీల కోటా నుండి వైకాపా నుండి తెలుగుదేశంలో చేరిన జలీల్‌ఖాన్(కృష్ణా) కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. వీరిని ఎంతవరకు పదవులు వరిస్తాయో అనుమానమే! మంత్రివర్గ విస్తరణంటూ జరిగితే చంద్రబాబు వైకాపా బలంగావున్న రాయలసీమ, ప్రకాశం, నెల్లూరుజిల్లాలపై ప్రధానంగా దృష్టిపెట్టి మంత్రి పదవులు కేటాయించే అవకాశాలున్నాయి. ఒకవేళ ఈ నెల లేదా మార్చినెలలో విస్తరణ లేకుంటే ఎన్నికలదాకా మంత్రివర్గ విస్తరణపై ఆశలు వదులుకోవాల్సిందే!

## ఏడు నెలలుగా ఇన్‌ఛార్జే దిక్కు?

దేశానికి మన రాష్ట్రమే మార్గం చూపాలి, దేశంలో అభివృద్ధిలో మనమే నెంబర్‌వన్ అని ఎప్పుడూ డబ్బాకొట్టే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడు నెలలుగా తన రాష్ట్రానికి శాశ్వత డిజిపిని నియమించుకోలేకున్నారు. 7 నెలలుగా సాంబశివరావు ఇన్‌ఛార్జ్ డిజిపిగా వ్యవహరిస్తున్నారు. కాపు రిజర్వేషన్ల ఉద్యమాలను అణచి వేయడంలోనూ, అలాగే ప్రత్యేకహోదా ఉద్యమాలను తొక్కడంలోనూ డిజిపిగా సాంబశివరావు కీలకంగా వ్యవహరించారు. ముఖ్యంగా డిజిపి తనమీద పసుపు ముద్ర వేయించుకున్నారనే చెప్పవచ్చు. ఇంత నమ్మకంగా పనిచేసే డిజిపిని పంపించడానికి చంద్రబాబుకు, లోకేష్‌కు మనసొప్పడం లేదు. రాష్ట్రానికి శాశ్వత డిజిపినే నియమించలేని చంద్రబాబు ఇక మంత్రివర్గ విస్తరణకు ఏ మాత్రం పూనుకుంటాడన్నది సందేహం.

# నగరానికి నిధులెక్కువ కావాలి

**- ఎమ్మెల్యే డా.అనిల్‌కుమార్‌యాదవ్**

నెల్లూరు నగరంలోని అనేక ప్రాంతాలు బాగా వెనుకబడివున్నాయని, ఆయా ప్రాంతాలకు సబ్‌ప్లాన్ నిధులు పుష్కలంగా కేటాయించి అభివృద్ధికి బాటలు వేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే డా. అనిల్‌కుమార్‌యాదవ్ సూచించారు. మంగళవారం ఆయన నెల్లూరు నగరంలోని 6వ డివిజన్‌లో కమ్యూనిటీ టాయ్‌లెట్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అరుంధతిపాళెంలో టాయ్‌లెట్స్‌ను చక్కగా ఏర్పాటుచేసినందుకు అధికారులను అభినందిస్తున్నానన్నారు. ఇదేవిధంగా కుసుమ హరిజనవాడకు రానున్న ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధుల్లో కోటికి పైగా నిధులు మంజూరైతే ఇక్కడ ప్రజలకు సంబంధించి ముఖ్యమైన సౌకర్యాలు కల్పించేందుకు వీలవుతుందన్నారు. నెల్లూరు నగరానికి చెందిన ఎస్‌సి కాలనీలకు కూడా ఎక్కువ నిధులు కేటాయిస్తే కాలనీల్లో అభివృద్ధికి అవకాశం వుంటుందన్నారు. కుసుమహరిజనవాడకు గతంలో కంటే ఎక్కువ నిధులు కేటాయించాలని, 6వ డివిజన్‌లోని అరుంధతిపాళెం, రామ్‌నగర్, ఉప్పరపాళెంతో పాటు ఎస్‌సి కాలనీలన్నింటి అభివృద్ధికి వచ్చే సబ్‌ప్లాన్ నిధుల్లో కనీసం 20కోట్లు కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, ఎం.డి ఖలీల్ అహ్మద్, దేవరకొండ అశోక్‌లతోపాటు నాయకులు కుంచాల శ్రీనివాసులు, వందవాశి రంగ, దార్ల వెంకటేశ్వర్లు, హరీష్, తులసి, మద్దినేని శ్రీధర్, చిరంజీవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోరుకొండకు నేతాజీ విద్యార్థి



2017-18 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి జనవరి నెలలో జరిగిన ఎంపిక పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థి సి.ఫల్గుణ్ ఎంపికైనట్లు శ్రీ నేతాజీ పైలట్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఫల్గుణ్ తండ్రి సుబ్బయ్యను ఉపాధ్యాయులు అభినందించినట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసన్న, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్.చెంచయ్య, ఉపాధ్యాయులు నవాజ్, లక్ష్మి పాల్గొన్నారు.

# పెంచలకోనకు భారీ ఆదాయం

నెల్లూరుజిల్లా రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో సోమవారం వివిధ హక్కులకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించగా, భారీ ఆదాయం లభించింది. ఆలయ ఛైర్మెన్ నానాజీ, ఇ.ఓ శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన వేలంలో తలనీలాలు పోగు చేసుకునే హక్కు ద్వారా రూ.1.51కోట్లు, మూడు ఆలయాల్లో వస్త్రాలు సేకరించుకునే హక్కు ద్వారా రూ.4.37లక్షలు ఆదాయం లభించింది. పూజ సామాగ్రి విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ, చెప్పుల స్టాండు, వాహనాల పార్కింగ్ హక్కులను ఆలయం నిర్ణయించిన రేట్లకన్నా తక్కువగా పాడటంతో వేలం వాయిదా వేశారు. పాలకవర్గం సభ్యులు పీర్ల సోమయ్య, హరనాథ్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ సినిమాలో... విలన్‌లే హీరోలు?

(మొదటి పేజీ తరువాయి)

సంఘటనలన్నీ తెలుసు. వాటిని ధైర్యంగా ప్రజల ముందుకు తేగలరా? ఒకవేళ తెస్తే ఆయన జీవితచరిత్రలో పాజిటివ్ క్యారెక్టర్లున్నాయి, నెగటివ్ క్యారెక్టర్లున్నాయి. ఉన్నవి ఉన్నట్లు బాలకృష్ణ చూపగలడా? ఎన్టీఆర్ జీవిత చరిత్రను పరిశీలిస్తే పుట్టుక నుండి సినిమా రంగ ప్రవేశాన్ని మొదలుకొని 'శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర' సినిమా వరకు ఒక పార్ట్. సినిమా రంగంలో ఆయన వ్యక్తిగత విజయాలు తప్పితే సంచలనాలకు చోటు లేదు. ఇక 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుండి రెండో పార్ట్‌గా తీసుకోవాలి. 1983లో అద్భుత ప్రజాప్రభంజనంతో అధికారంలోకి రావడం, 1984లో నాదెండ్ల భాస్కర్‌రావు చేతిలో వెన్నుపోటుకు గురై పదవీచ్యుతుడు కావడం, తిరిగి ప్రజామద్దతు కూడగట్టి నాదెండ్లను దించడం, 1985లో అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళ్లి విజయం సాధించడం, 1989లో అధికారం కోల్పోవడం, 1993లో లక్ష్మీపార్వతిని పెళ్లి చేసుకోవడం, 1994లో తిరిగి అధికారంలోకి రావడం, 1995లో చంద్రబాబు చేతిలో వెన్నుపోటుకు గురై సీఎం పదవిని కోల్పోవడం, వైస్రాయ్ హోటల్ వద్ద తాను గెలిపించిన ఎమ్మెల్యేలే తనపై చెప్పులు విసరడం, తనను పదవీచ్యుతుడిని చేసిన చంద్రబాబుపై ఎన్టీఆర్ తీవ్ర విమర్శలు చేయడం, ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేయడంలో కొడుకులు, కూతుర్లు, మరో అల్లుడు ప్రధానపాత్ర పోషించడం, తీవ్ర మానసిక వేదనతో ఎన్టీఆర్ 1996 జనవరిలో మరణించడం... ఎన్టీఆర్ రాజకీయ చరిత్రలో ప్రధాన ఘట్టాలు. వీటిలో ఆయా క్యారెక్టర్లను పర్‌ఫెక్ట్‌గా చూపించకపోతే ఆ సినిమాకు అర్థమే లేదు. ఎన్టీఆర్ జీవిత చరిత్రను అర్థంపర్థం లేకుండా చేసినట్లవుతుంది. 1984లో ఎన్టీఆర్‌కు నాదెండ్ల పొడిచింది వెన్నుపోటు అయితే 1995లో చంద్రబాబు చేసింది కూడా అదే! నాదెండ్లను విలన్‌గా చూపించొచ్చు. అదే సమయంలో తన బావ చంద్రబాబును బాలయ్య విలన్‌గా చూపించగలడా? ఖచ్చితంగా చేయడు. లక్ష్మీపార్వతి ఉచ్చులో చిక్కుకున్న ఎన్టీఆర్‌ను, తెలుగుదేశం పార్టీని కాపాడడానికే ఆరోజు ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసారన్నట్లు చూపిస్తారు. అలాగే ఎన్టీఆర్ కుటుంబసభ్యులను కూడా మంచిగానే చూపించుకుంటారు. ఎన్టీఆర్ సినిమాలో విలన్‌లుగా చూపబోయేది నాదెండ్ల భాస్కర్‌రావు, లక్ష్మీపార్వతిలనే! ఇందులో సందేహమేలేదు.



# సీనియర్ న్యాయవాది చివుకుల కన్నుమూత

నెల్లూరు నగరంలోని పాత తరం ప్రముఖుల్లో ఒకరైన సీనియర్ న్యాయవాది, చివుకుల సత్యనారాయణమూర్తి ఈ నెల 2వ తేదీన స్థానిక బాలాజీనగర్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన వయసు 96 సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. చిన్నవయసు నుంచే నాటకరంగంపై మక్కువతో సత్యనారాయణమూర్తి తన మిత్రులైన గట్టుపల్లి సుబ్రహ్మణ్యం, బి.విశ్వనాథం, చతుర్వేదుల గోపాలకృష్ణమూర్తి తదితరులతో కలిసి 'ఆంధ్రసభ'లో ఎన్నో సాంఘిక పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. నెల్లూరును మరో తిరువాయూర్‌గా మార్చిన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారితో కలిసి భిక్షాటనాపూర్వక త్యాగరాజ స్వామి స్మరణోత్సవసభకు ఎంతోకాలం తన సేవలందించారు. కొంతకాలం పాటు ఆ సంస్థకు అధ్యక్షునిగా కూడా వ్యవహరించారు. స్వయంగా కర్నాటక విద్వాంసులైన ఆయన ప్రతి ఏటా జరిగే ఉత్సవాలకోసం భిక్షాటనా కార్యక్రమంలో పాల్గొని శ్రీ త్యాగరాజస్వామి కృతులను ఆలపిస్తూ భిక్షాటన చేసేవారు. అంతేకాదు, నెల్లూరు నగరంలో తొలిసారిగా ఏర్పడిన నెల్లూరు పర్మనెంట్ ఫండ్ ఆఫీసుకు ఎంతోకాలం అధ్యక్షునిగా కూడా పనిచేసి ఆ సంస్థ అభివృద్ధికి బాటలు వేశారు. మూలాపేటలోని వేద సంస్కృత పాఠశాలకు అధ్యక్షునిగా కూడా ఆయన సేవ నిరుపమానం. ఈయన తండ్రి అప్పటి ప్రముఖుడు, సీనియర్ న్యాయవాది చివుకుల మాలకొండయ్య కూడా ఎంతో ప్రతిభావంతులు..సౌమ్యులు. ఆయన స్వభావాన్ని పుణికిపుచ్చుకున్న



త్యాగరాజ భిక్షాటన కార్యక్రమంలో చివుకుల సత్యనారాయణమూర్తి

సత్యనారాయణమూర్తి కూడా మృదుస్వభావి, అందరిపట్ల ఎంతో ఆదరంగా వుండేవారు. ఈ నెల 6న చివుకుల సత్యనారాయణ మూర్తిగారి అంత్యక్రియలకు అనేకమంది ఆత్మీయులు విచ్చేసి ఆయన నెల్లూరు నగరానికి, ప్రత్యేకించి భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్వామి ఉత్సవాల నిర్వహణకు చేసిన సేవలను మరోసారి జ్ఞాపకం చేసుకున్నారు. నెల్లూరు పర్మనెంట్ ఫండాఫీసుకు ఆ రోజున సెలవు ప్రకటించి చివుకుల మృతికి సంతాపం ప్రకటించారు. శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ కమిటీ ఉపాధ్యక్షులు ఇంగువ వేంకటరాఘవ శాస్త్రి, శాశ్వత కార్యదర్శి డాక్టర్ వై.నాగదేవిప్రసాద్, కోశాధికారి టి.చంద్రమౌళి, ఫండ్‌ఆఫీస్ అధ్యక్షులు చతుర్వేదుల శ్రీరామమూర్తి, కోశాధికారి గట్టుపల్లి మురళి, సీనియర్ సర్జన్ డాక్టర్ పి.మధుసూదనశాస్త్రి, విఆర్‌సి ఫిజిక్స్ రీడర్ డా.ఎం.సుబ్రహ్మణ్యం, ప్రముఖ సంగీత విద్వాంసులు బి.మాదేశ్వరకుమార్ తదితరులు చివుకుల సత్యనారాయణమూర్తి అంత్యక్రియల్లో పాల్గొని ఆయన మృతికి తమ సంతాపం ప్రకటిస్తూ కన్నీటి నివాళులర్పించారు.

# తమిళనాట... కుర్చీ ఆట!

**సమర్ధులైన నాయకులు ఉన్నట్లుండి చనిపోతే ఆయా రాష్ట్రాల పరిస్థితులు ఎంత ఘోరంగా తయారవుతాయన్నదానికి మొన్న ఆంధ్రప్రదేశ్ ఒక ఉదాహరణ కాగా, నేడు తమిళనాడు ఇంకో ఉదాహరణగా నిలుస్తోంది. డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి దుర్మరణంతో ఆంధ్రప్రదేశ్ స్వరూపమే మారిపోతే, నేడు జయలలిత మరణంతో తమిళనాడు రాజకీయమే అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతోంది.**

2009లో సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంలో వై.యస్. మరణించకపోయి ఉంటే ఈరోజు ఆంధ్రప్రదేశ్ ఎలా ఉండేది? రాష్ట్ర విభజన జరిగేది కాదు. హైదరాబాద్ మన రాజధానిగానే ఉండేది. హైదరాబాద్‌లో మనకు అన్ని అవకాశాలుండేవి. రాష్ట్ర రాజకీయాలు కూడా ఎంతో సాఫీగా నడిచేవి. చంద్రబాబు, కేసీఆర్‌లు ముఖ్యమంత్రులై ఉండేవాళ్లు కాదు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పటిష్టంగానే ఉండేది. జగన్ జైలుపాలయ్యేవాడు కాదు, వైయస్సార్ కాంగ్రెస్ అనే పార్టీ పుట్టుకొచ్చేది కాదు. కేవలం వై.యస్. మరణం వల్లే రాష్ట్రంలో ఇన్ని మార్పులు సంభవించాయి. రాష్ట్రం ఇన్ని కష్టనష్టాలకు లోనైంది.

నిన్న ఆంధ్రప్రదేశ్‌కు ఎదురైన పరిస్థితే ఇప్పుడు తమిళనాడు ఎదుర్కొంటోంది. జయలలిత మరణంతో ఆ రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. జయలలిత ఉన్నంతకాలం ఆమె కనుసన్నల్లో నడిచిన అన్నాడిఎంకె పార్టీలో ఇప్పుడు ఆమె లేని లోటు కనిపిస్తోంది. ఆ పార్టీలో సంక్షోభం నెలకొంది. జయలలిత మృతి తర్వాత ఆమె నమ్మినబంటు పన్నీరుసెల్వంను ముఖ్యమంత్రిని చేయడం తెలిసిందే! అయితే పన్నీర్‌ను సీఎంను చేయడంలో కేంద్రప్రభుత్వం కీలకపాత్ర పోషించింది. జయలలిత ప్రభుత్వంలో అవినీతి జమానా నడిపిన శశికళ సీఎం కావడం ప్రధాని నరేంద్రమోడీకి ఇష్టం లేదు. అందుకే ఆయన ఆరోజు పన్నీర్‌కు పట్టం కట్టించారు. కాని పన్నీర్ సీఎం కావడాన్ని



- **సమర్ధులు లేకుంటే రాష్ట్రాలే అస్తవ్యస్థం**
- **నాడు వై.యస్ మరణంతో ఆంధ్రప్రదేశ్... నేడు జయ మరణంతో తమిళనాడు...**

శశికళ ఓ పట్టాన జీర్ణించుకోలేకపోయింది. అన్నాడిఎంకెలో జయలలిత తర్వాత స్థానం శశికళదే! ఆ విధంగా ఆమె పట్టు సాధించుకుంది. అన్నాడిఎంకె ఎమ్మెల్యేలను ఆ విధంగా తన గుప్పిట్లో ఉంచుకొంది. పన్నీర్ సెల్వంను ఎక్కువకాలం కొనసాగనిస్తే పార్టీపై అతను పట్టు పెంచుకుంటాడన్న అనుమానంతో శశికళ వ్యూహం మార్చింది. కొందరు సీనియర్ మంత్రుల చేత శశికళ సీఎం పదవిని చేపట్టాలంటూ ప్రకటన లిప్పించింది. వ్యూహాత్మకంగా పన్నీర్‌సెల్వంను పొయెస్‌గార్డెన్‌కు పిలిపించి అతని చేత రాజీనామా చేయించింది. ఆ తర్వాత ఎమ్మెల్యేల చేత తాను శాసనసభాపక్ష నాయకురాలిగా ఎన్నికైనట్లు ప్రకటించుకుంది. మద్రాసు యూనివర్శిటీ వేదికగా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం ఏర్పాట్లు కూడా చేసుకుంది.

అయితే ఇక్కడే రాజకీయం రంగులు మారింది. సీఎం పదవికి సైలంట్‌గా రాజీనామా చేసాడనుకున్న పన్నీర్ సెల్వం బాంబు పేల్చాడు. మెరీనాబీచ్‌లోని జయలలిత సమాధి వద్ద ముప్పావుగంట మౌనదీక్ష చేసి, ఆ తర్వాత సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన చేత బలవంతంగా రాజీనామా చేయించారని, అమ్మ మృతిపై అనుమానాలున్నాయని, సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు కోరితే తన రాజీనామాను ఉపసంహరించుకుంటానని ప్రకటన చేయ డంతో తమిళనాడు రాజకీయాలు వ్యూహాత్మకంగా మలుపు తిరిగాయి. ఈ దశలోనే జయలలిత, శశికళ దోషులుగా వున్న అక్రమాస్తుల కేసుపై సుప్రీంకోర్టు మరో వారంలోపే తీర్పు ఇవ్వబోతోంది. ఈ తీర్పులో శశికళను దోషిగే తేలిస్తే ఇక ఆమె సీఎం పీఠంపై ఆశలు వదులుకోక తప్పదు. ఈ పరిణామాలను ఊహించే శశికళ ముందుగానే ప్రమాణస్వీకారానికి సిద్ధమైంది. అయితే ప్రధాని నరేంద్రమోడీతో పాటు డిఎంకె అధినేత స్టాలిన్‌కు, తమిళనాడులో మెజార్టీ శాతం ప్రజలకు శశికళ సీఎం కావడం ఇష్టంలేదు. వీరంతా కూడా పన్నీర్‌సెల్వంనే సమర్ధించసాగారు. తమిళ సినీ ప్రముఖులు కూడా పన్నీర్‌కే ఎక్కువగా మద్దతు పలికారు. కాని అన్నాడిఎంకె ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్కువ మంది శశికళవైపే ఉన్నారు. ఎమ్మెల్యేలు తన చేజారిపోకుండా ఆమె క్యాంపు రాజకీయాలకు తెరతీసారు. ఎమ్మెల్యేలను హోటల్స్‌లో ఏర్పాటు చేసిన క్యాంపులకు తరలించారు. మరో పక్క పన్నీర్‌సెల్వం చీలిక వర్గానికి డిఎంకె మద్దతు తెలుపు తోంది. పన్నీర్‌సెల్వం శిబిరంలోకి పది నుండి పదిహేనుమంది ఎమ్మెల్యేలు వస్తే చాలు... ఆయన సీఎంగా కొనసాగడం పెద్ద కష్టమేమీ కాదు.

ఈ నెల 9వ తేదీ వరకు పన్నీర్‌సెల్వం, శశికళలలో పీఠం ఎవరికనేదానిపై క్లారిటీ లేదు. ఇక్కడ గవర్నర్ విద్యాసాగర్‌రావు నిర్వహించే పాత్ర కీలకం కాబోతోంది. రాజ్యాంగ ప్రకారం వెళితే మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతువున్న శశికళకు రూటు క్లియర్ చేయక తప్పదు. అలాకాకుండా కేంద్రం ఆడించినట్లు ఆడితే తమిళ రాజకీయాలు ఇంకొంత కాలం గందరగోళంగానే వుంటాయి. పన్నీర్ సెల్వంకే పీఠం అప్పగించాలనుకుంటే గవర్నర్ రాజ్యాంగపరమైన విమర్శలను ఎదుర్కోక తప్పదు. ఏదేమైనా ఒకట్రెండు రోజుల్లో తమిళనాట జరుగుతున్న కుర్చీ ఆటకు తెర పడే అవకాశముంది.

# ఒకే రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలు

### - 15న ఇస్రో చరిత్రాత్మక ప్రయోగం

***అంతరిక్ష విజ్ఞానంలో భారత్ రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. అంతరిక్షంలో మరో అత్యద్భుతాన్ని ఆవిష్కరిస్తూ ఈనెల 15న నింగిలోకి ఒకేసారి ఒకటి రెండు కాదు.. ఏకంగా 104 ఉపగ్రహాలను పంపేందుకు సమాయత్తమైంది. ఉపగ్రహాల ప్రయోగంలో ఇప్పటిదాకా రష్యా ఒకే రాకెట్ ద్వారా 37 ఉపగ్రహాలను పంపి రికార్డు సృష్టిస్తే, ఇప్పుడు భారత్ ప్రపంచంలోనే కనీవినీ ఎరుగని విధంగా ఒకేసారి ఒకే రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలను పంపేందుకు సంకల్పించడంతో ప్రపంచదేశాల దృష్టి అంతా షార్‌పైనే వుంది.***



భారత్ కీర్తి పతాక..ఇస్రో ఇప్పటికే ఎన్నో సంచలన విజయాలు సాధించి, అంతరిక్ష ప్రయోగాల్లో తనదంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకుంది. ఎన్నో విజయాలతో షార్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు తాజాగా తమ విజయరథమైన పిఎస్ఎల్‌వి రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాలన్నిటినీ సునాయాసంగా మోసుకుపోయి నిర్ధేశిత కక్ష్యలో విజయవంతంగా విడిచిపెట్టేందుకు ఇస్రో సంసిద్ధమవుతోంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని షార్ సెంటర్ మొదటి ప్రయోగవేదిక నుంచి ఈ నెల 15వ తేదిన ఈ బృహత్తరమైన జంబోరాకెట్‌ను ప్రయోగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ముమ్మరకృషిలో వున్నారు. భూ పరిశీలన కోసం మనదేశానికి చెందిన 750 కిలోల కార్గోశాట్-2 ఉపగ్రహం, 10 కిలోల బరువున్న ఐఎన్ఎస్-1ఏ, 1 బి అనే చిన్న ఉపగ్రహాలతో పాటు, మరో 500 కిలోల బరువు కలిగిన 101 విదేశీ ఉపగ్రహాలను పిఎస్ఎల్‌వి సి-37 ద్వారా నింగిలోకి పంపనున్నారు. ఈ అత్యద్భుత ప్రయోగాన్ని 90 నిమిషాల్లో పూర్తిచేయాలని శాస్త్రవేత్తలు నిర్ణయించుకున్నారు. అత్యంత క్లిష్టమైన ఈ ప్రయోగాన్ని దిగ్విజయం చేసి అంతరిక్ష రంగంలో ఇప్పటిదాకా వున్న రికార్డులను అధిగమించి, ఎవరూ ఊహించని రీతిలో అపూర్వమైన రికార్డును సృష్టించాలని శాస్త్రవేత్తలు నిర్విరామ కృషి చేస్తున్నారు. రష్యా 2014లో 37 ఉపగ్రహాలను ఒకేసారి నింగిలోకి పంపి అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. భారత్ చేస్తున్న ఈ బృహత్తర ప్రయోగంతో రష్యా రికార్డుకు అందనంత ఎత్తులో ఒకేసారి ఒకే రాకెట్‌తో 104 ఉపగ్రహాలను పంపనుంది. మన శాస్త్రవేత్తలు చేస్తున్న ఈ చరిత్రాత్మక ప్రయోగం దిగ్విజయం కావాలని, అంతరిక్షరంగంలో ప్రపంచంలోనే భారత్ ప్రతిభాపాటవాలను నిరూపించుకుంటూ తన సత్తా చాటుకోవాలని ప్రజలంతా మనసారా ఆకాంక్షిస్తున్నారు.



# అధికారుల అటవిడుపు

### • రసవత్తరపోరులో కలెక్టర్‌దే గెలుపు

విధి నిర్వహణలో ఎప్పుడు ఉరుకులు, పరుగుల మీదుండే అధికారులు రెండురోజులు ఆడుతూ పాడుతూ గడిపారు. ఆటలను సరదాగా ఎంజాయ్ చేసారు. రెండురోజుల పాటు నెల్లూరు ఏ.సి స్టేడియంలో జరిగిన రెవెన్యూ క్రికెట్ పోటీలలో కలెక్టరేట్ జట్టు విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్ టిట్వంటీ మ్యాచ్‌లో గూడూరు డివిజన్‌జట్టుపై కలెక్టరేట్ జట్టు 8వికెట్ల తేడాతో గెలిచింది. 13వ ఓవర్‌లో కలెక్టరేట్ జట్టు కెప్టెన్ కలెక్టర్ ముత్యాలరాజు, వైస్ కెప్టెన్ జేసీ ఇంతియాజ్ అహ్మద్‌లు బ్యాటింగ్‌కు దిగి తమ జట్టును గెలిపించారు.

అలాగే గురువారం కలెక్టర్ లెవన్, ఎస్పీ లెవన్ జట్ల మధ్య 20ఓవర్ల ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఎస్పీ లెవన్ జట్టు 8వికెట్ల తేడాతో గెలిచింది. ఎస్పీ లెవన్ జట్టులో ఎస్పీ విశాల్ గున్నీ 37పరుగులు చేసి నాటౌట్‌గా నిలవడం విశేషం.

# నెల్లూరులో జీరో బడ్జెట్ రాజకీయ సదస్సు

అసలు మన రాజకీయ వ్యవస్థ ఏంటి? ఈ వ్యవస్థలోని లోపాలేంటి? ఔన్నత్యాలేంటి... అనే అంశాలపై లోతుగా అధ్యయనం చేసేందుకు, చర్చించేందుకు ఈ నెల 26వ తేదీన నెల్లూరులోని డికెడబ్ల్యూ కాలేజీలో జీరోబడ్జెట్ పొలిటిక్స్ సదస్సు నిర్వహిస్తున్నట్లు జీరో బడ్జెట్ పొలిటక్స్ వ్యవస్థాపకులు పి.మాధవరెడ్డి 'లాయర్'కు తెలిపారు. జాతీయ సమగ్రత, ఆర్థిక, సామాజిక అభివృద్ధి, రాజకీయాలలో నైతిక విలువలు వంటి అంశాలపై చర్చ ఉంటుంది. ఈరోజు సమాజంలో జరిగే ప్రతి సమస్యకు రాజకీయాలే ప్రధాన కారణమవుతున్నాయి. ప్రతిఒక్కరూ రాజకీయ వ్యవస్థను తిట్టుకునే వారే! అయితే ఈ వ్యవస్థను తిట్టుకుంటే సమస్యలకు పరిష్కారాలు దొరకవు. రాజకీయ వ్యవస్థను మార్చాలి. ఈ వ్యవస్థను మార్చాలంటే సామాన్యుడు రాజకీయాల్లోకి రావాలి. యువత, నిస్వార్ధపరులు రాజకీయాల వైపు అడుగులు వేయాలి. అలాంటివారిలో రాజకీయ చైతన్యం కోసమే ఈ సదస్సును నిర్వహిస్తున్నామని, 26వ తేదీ ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు జరుగుతుందని మాధవరెడ్డి పేర్కొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com